## అప్పాయిపల్లి భూ బాధిత రైతులకు ప్లాట్ల పట్టాలు పంపిణీ



రైతులకు ఇండ్ల స్థలాల పట్టాలను అందిస్తున్న అధికారులు

కొడంగల్,డిసెంబర్ 19ప్రభాతవార్త కొడంగల్ మండలంలోని అప్పాయిపల్లి గ్రామ శివారులోని సర్వేనెంబర్ 19లో మెడికల్‌య,వెటర్నరీ కళాశాల నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభు త్వం ఇండ్ల స్థలాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించింది. గురువారం కొడంగల్ తహశీల్దార్ విజయ్ కుమార్,సబ్ రిజిస్ట్రర్ రవికాంత్ భూములు కోల్పోతున్న అప్పాయిపల్లి రైతులకు ప్లాట్ల పట్టాలను అందజేశారు.కొడంగల్ మండలం అప్పాయిపల్లి శివారులోని సర్వే నెంబర్ 19లో డీటీసీపీ లేఅవుట్ ద్వారా ప్రభుత్వమే రైతులకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తుందని అధికారులు తెలిపారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

### పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి



**ఆదిభట్ల, డిసెంబరు 19, ప్రభాతవార్త:** ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగళపల్లిలో గల మహనీయుము ప్రార్ధనా మందిరంలో పాస్టర్ కే.డేవిడ్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి పాస్టర్ డేవిడ్ ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మరి నిరంజన్ రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచడం జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సి పాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డితో పాటు మాజీ ఎంపీపీ కృపేష్, సీనియర్ నాయకులు కొప్పు జంగయ్య టీపీసీసీ కార్యదర్శి కొత్తకోరుమ శివకుమార్, కౌన్సిలర్ నారాయణ మోనిక సుధాకర్‌గౌడ్, హెచ్ రాజు రమేష్ మహేష్ సంఘసంస్కర్తలు పాల్గొన్నారు.



ట్రాఫిక్ నియంత్రణ కోసం బారికేడ్లను పోలీస్ శాఖకు అందజేస్తున్న దృశ్యం

## ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట ప్రణాళిక

### తాండూరు డిఎస్పి బాలకృష్ణారెడ్డి

**తాండూరు టౌన్,డిసెంబరు 19,ప్రభాతవార్త :** తాండూరు పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రతిష్టమైన చర్యలు చేపడుతున్నట్లుగా తాండూరు డిఎస్పి బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని తాండూరు ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ మరియు ప్రవేట్ జూనియర్ కళాశాల అసోసియేషన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం 20 భారీ కేడ్లను పోలీస్ శాఖకు అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ నిర్వాహకులు అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ..పట్టణంలో రోజు రోజు కు పెరుగుతున్న ట్రాఫిక్ ఇబ్బందుల వల్ల స్కూల్ కి వెళ్లే విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఇబ్బందికరంగా ఉందని తాండూరు పట్టణ సీఐ సంతోష్ కుమార్ విజ్ఞప్తి మేరకు పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా 20 నుంచి 30 భారీ కేడ్లను అందించడం జరిగిందని అన్నారు. అతివేగంగా కారణంగానే ప్రమాదాలు జరుగుతాయని. ఈ ప్రమాదాలను అరికట్టాలంటే నియంత్రణ తప్పనిసరి అని అన్నారు.కావున ప్రతి ఒక్కరు కూడా ట్రాఫిక్ నిబంధన పాటించాలని పేర్కొన్నారు. మరోవైపు కాలేజ్ నిర్వాహకులు మాట్లాడుతూ... తమ కళాశాల సమీపంలో టీజింగ్ జరగకుండా షీ టీం గాని గస్తిని పెంచాలని డిఎస్పీని కోరారు. అనంతరం పట్టణ డిఎస్పి బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ... ట్రాఫిక్ నియంత్రణ కోసం స్కూల్ మరియు కళాశాల యాజమాన్యం భారీ కేడ్లను అందించడం పై అభినందించారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రతిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లుగా తెలిపారు. అదే విధంగా స్కూల్ ,కళాశాల సమయాలలో లారీలను అదుపు చేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను పాటించేలా చూడాలని యాజమాన్య నిర్వాహకులకు తెలిపారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని అన్నారు కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలలు యాజమాన్య సంఘం అధ్యక్షులు రవీందర్ రెడ్డి, కార్యదర్శి మోహన కృష్ణ, అగ్గనూర్ కిరణ్,వెంకట్ రెడ్డి, ఇందూరు రాములు, సతీష్, శివ,అభి, షాహెల్, యూనుస్, వహీద్, బాలస్వామి, కల్పన, కవిత, రమేష్ మరియు ప్రైవేట్ కళాశాలల యాజమాన్య సభ్యులు రంగా రావు, జి. నరేందర్, పర్యాద రామకృష్ణ, సంగీత, ఆనంద్, నర్సిములు ,సంగీత, ఆనంద్, నర్సిములు ఉన్నారు.

## బహదూర్ గూడ రైతులకు న్యాయం చేయండి

### రైతులకు పట్టాలు ఇవ్వండి : పట్లోళ్ల కార్తీక్ రెడ్డి



**శంషాబాద్. డిసెంబరు19, ప్రభాతవార్త** శంషాబాద్ మండలంలోని బహదూర్ గూడ గ్రామంలో దేశానికి స్వాతంత్రం రాక ముందటి నుండి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న రైతులకు వెంటనే పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి డిమాండ్ చేశారు. శంషాబాద్ మాజీ జెడ్పిటిసి డిసిసిబి డైరెక్టర్ బూర్కుంట సతీష్.. నార్సింగ్ వ్యవసాయ కమిటీ మాజీ చైర్మన్ మంచర్ల మమత శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైతులు గురువారం కార్తీక్ రెడ్డి ని కలిసి తమ సమస్యలను ఏకరువు పెట్టుకున్నారు. రెవిన్యూ రికార్డులు పుట్టక ముందటి నుండి తాము ఆ భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నామని తమ పూర్వీకుల నుండి తమకు వచ్చిన భూమిలో తమకు పట్టాదారు పాసుబుక్కులు ఇవ్వడం లేదని వారు తెలిపారు. ఆ భూముల మీదనే ఆధారపడి జీవిస్తున్న తమకు ప్రభుత్వం అన్యాయం చేస్తున్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యలు విన్న కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ రైతులందరూ ఏకమై ప్రభుత్వంపై చేస్తున్న పోరాటానికి తన పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. దీర్ఘకాలికంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యను ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దాదాపు 30. 40 సంవత్సరాల నుండి రైతులు ఆందోళన చేస్తున్న ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం పట్ల ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు న్యాయం చేయడం కోసం తాను రైతుల ఆందోళనకు మద్దతు ప్రకటిస్తున్నానని కార్తీక్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు చలివేంద్రి వెంకట్ రెడ్డి. హనుమంతు ముదిరాజ్. చిన్న గండు రాజేందర్. తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ విద్యార్థులకు ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

**వికారాబాద్, డిసెంబరు 19, ప్రభాతవార్త:** జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు గుర్తింపు పొందిన పాఠశాల యందు విద్యాభ్యాసం చేస్తున్న దివ్యాంగ విద్యార్థులు 2024-2025సంవత్సరానికి గాను ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం జనవరి 15 వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారిని బి.కృష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థుల వివరాలతో సంబంధిత వెబ్ సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్న తర్వాత సంబంధిత ధ్రువపత్రాలను జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం నందు అందచేయాలని తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఇతర సమాచార కోసం 9502912981 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

## లంబాడీల మహా గర్జనను విజయవంతం చేయండి

### ఎల్‌హెచ్‌పీఎస్ యూత్‌వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ అయోధ్య శ్రీనివాస్

**షాద్‌నగర్, డిసెంబరు 19 ప్రభాతవార్త :** గిరిజనుల భాష అయిన లంబాడీ భాషను భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని ఎల్‌హెచ్‌పీఎస్ యూత్‌వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ అయోధ్య శ్రీనివాస్ కోరారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 1న ప్రభుత్వం సెలవు రోజుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇదే అంశాలపై ఈనెల 29న షాద్‌నగర్ గిరిజన మహాగర్జన పేరుతో సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పార్టీలకు అతీతంగా గిరిజనులు పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. గిరిజనుల హక్కులను సేవాలాల్ మహారాజ్‌ను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరు పార్టీలను, రాజకీయాలను విడిచిపెట్టి కుల హక్కులకై ఉద్యమించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు బెల్లయ్య నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొంటున్నట్లు తెలిపారు.

# క్రీడలతోనే క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు

**సాంఘీక సంక్షేమ గురుకులాల రాష్ట్ర ఆర్థిక విభాగం అదనపు కార్యదర్శి కిరణ్మయి**

**కమ్మదనం గురుకుల పాఠశాలలో పదవ రాష్ట్ర స్థాయి క్రీడలు ప్రారంభం**

**ఆర్ట్ గ్యాలరీని ప్రశంసించిన ప్రముఖులు**



డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రమాదాలను నివారించేందుకు విద్యార్థినులు రూపొందించిన ప్రయోగం

**షాద్‌నగర్, డిసెంబరు 19 ప్రభాతవార్త :** క్రీడలతోనే విద్యార్థుల్లో విశ్వాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవడతాయని తద్వారా విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు క్రీడలు సహకరిస్తాయని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల రాష్ట్ర ఆర్థిక విభాగం అదనపు కార్యదర్శి కిరణ్మయి అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం ప్రభుత్వ సాంఘీక సంక్షేమ గురుకులం ప్రాంగణంలో 10వ రాష్ట్ర స్థాయి క్రీడలు ప్రారంభం అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గురుకులాలకు సంబంధించిన విద్యార్థినులు ఈ క్రీడల్లో పాల్గొన్నారు. గరువారం ప్రారంభమైన కార్యక్రమాన్ని రాష్ట్ర ఫైనాన్స్ అదనపు కార్యదర్శి జ్యోతిర్మయి, పోలీస్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ రంగస్వామిలు జ్యోతిప్రజ్వలనచేసి క్రీడలను ప్రారం భించారు. ఈ సందర్భంగా హాజరైన విద్యార్థులను ఉద్దేశించి అదనపు కార్యదర్శి కిరణ్మయి మాట్లాడుతూ క్రీడలు మానసిక విశ్వాసాన్ని కూడా పెంచుతాయని అన్నారు. విద్యార్థుల్లో పోటీతత్వం వల్ల నాయకత్వ లక్షణాలు వస్తాయని, ఎంతో క్రమశిక్షణ పెరుగుతుందని ఆమె తెలిపారు. ఏసీపీ రంగస్వామి మాట్లాడుతూ గురుకులాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులను గురుకులను ఎప్పటికీ మర్చిపోకూడదని వారి సూచనలతో అభివృద్ధి సాధించాలని అన్నారు. క్రీడలు ఎంతో శక్తివంతమైనవని అన్నారు. క్రీడలతో ప్రభుత్వ ఉద్యోగాలు కూడా సునాయాసంగా వస్తాయని అన్నారు. నేడు జాతీయ క్రీడల్లో రాణిస్తున్న ఎంతోమంది క్రీడాకారులకు ప్రభుత్వ ఉన్నత ఉద్యోగాలు లభిస్తున్నాయని ఈ సందర్భంగా హైదరాబాది క్రికెటర్ సిరాజ్ గురించి కూడా ఆయన నిదర్శనంగా చెప్పారు. కమ్మదనం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ విద్యుల్లత మాట్లాడుతూ కమ్మదనం గురుకుల విద్యాభివృద్ధికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్న స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గురుకులాల ప్రగతికి రాష్ట్ర కార్యదర్శి అలుగు వర్షిని చేస్తున్న కృషిని ఆమె కొనియాడారు. ఈనెల 21వ తేదీ వరకు నిర్వహించే రాష్ట్ర స్థాయి క్రీడలకు అన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.

### ఆకట్టుకున్న ఆర్ట్ గ్యాలరీ .. డ్రంక్ అండ్ వినూత్న టెక్నాలజీ

పదవ రాష్ట్ర స్థాయి గురుకులాల ఆటల పోటీల సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీ, అదేవిధంగా డ్రంక్ అండ్ డ్రవ్ ప్రమాదాల నివారణ కోసం వినూత్నంగా రూపొందించిన టెక్నాలజీని చూసి ప్రముఖులు చప్పట్లు కొట్టారు. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ కోడింగ్ అకాడమీ 9వ తరగతి విద్యార్థినులు టిన్స్ ప్రియ, అకల్య, అలేఖ్య, మాన్విత, అశ్రిత ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డ్రంక్ అండ్ డ్రైవ్‌కు సంబంధించి వాహనాలు ఆటోమెటిక్‌గా నిలిచిపోవడం వంటి నూతన ప్రయోగాలు ఆహ్వానితులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చిన్నారి విద్యార్థుల ఆలోచనలు చూసి షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, పట్టణ సీఐ విజయ్ కుమార్ తదితర ప్రముఖులు అభినందిస్తూ చప్పట్లు కొట్టారు. మ ద్యం తాగి వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమై ఏటా చనిపోతున్న వారి సంఖ్యను పోలీసులకు గ్యాలరీలో సంఖ్యాపరంగా వివరించారు. రోడ్డు ప్రమాదాలకు ఎక్కువ మద్యం మత్తులో జరుగుతున్న విషయాలను స్పష్టం చేశారు. నూతన పద్దతిలో డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టడానికి వాహనాల్లో కూర్చున్న వారితో ఆటోమెటిక్‌గా వాహనాలు నిలిచిపోయేలా ప్రయోగాత్మకంగా చేపట్టిన నూతన టెక్నాలజీ వివరించిన అందరినీఅభినందించారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ రంగస్వామితో పాటు సీఐ విజయ్ కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహ్మద్ అలీఖాన్ బాబర్, సంక్షేమ విద్యాలయాల రాష్ట్ర అధికారి భీమయ్య, మల్టీజోన్ 2 అధికారిణి రజని, జోనల్ ఆఫీసర్ వివేకానంద, ఇతర గురుకులాలకు చెందిన ప్రిన్సిపల్, డీపీ లతోపాటు కాంగ్రెస్ నేతలు ఇబ్రహీం, శ్రీకాంత్ రెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, నవీన్ తదితరులు హాజరయ్యారు.



ఆర్ట్ గ్యాలరీని సందర్శించిన కిరణ్మయి



రాష్ట్రస్థాయి క్రీడలకు హాజరైన విద్యార్థినులు, ప్రముఖులు

# వసతి గృహాలను తనిఖీ చేసిన కలెక్టర్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త:** జిల్లాలో తోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలుర వసతి గృహం 1, వెనుకవడిన తరగతుల బాలుర వసతి గృహాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారము వసతి గృహాలను ఆకస్మిక తనిఖి చేసి మాట్లాడుతూ హాస్టల్స్‌లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాల న్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విదంగా పర్యవేక్షణ చేయాలనీ సంబంధిత అధికారులకు ఆదేశించారు. వంటగదిలో గల బియ్యం, పప్పులను, కూరగాయలు, పరిసరాలను పరిశీలించారు. ప్రతి రోజు కొత్త మెనూ ప్రకారం వండాలన్నారు, ప్రతి రోజు టిఫిన్, భోజనం ఎలా పెడుతున్నారని విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార విషయంలో శుచి, శుభ్రత పాటించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాత్‌రూమ్ లు. టై లెట్స్‌ను పరిశీలించి ,పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా పర్యవేక్షణ చేయాలనీ సంబంధిత అధికారులను ఆదేశించారు. చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వసతి గృహాలలో ఫ్యాన్‌లు, లైట్స్, మేజర్, మైనర్ రిపేర్ పనులు ఎంత వరకు పూర్తి చేసారని వార్డేన్లను అడిగి తెలుసుకున్నారు. అన్ని పనులు పూర్తి చేసి రిపేర్‌కు ముందు పొటోలు, తర్వాత పొటోలు పంపించాలని తెలిపారు. విద్యార్థులు చదువుతున్న క్లాస్ రూమ్‌కి వెళ్లి చదువుతున్న తీరును పరిశీలించారు. 10వ తరగతి చదువుతున్న విద్యార్థులతో మాట్లాడుతూ, విద్యార్థులు అందరు బాగా చదివి పరీక్షలో ఉత్తీర్ణత సాదించాలన్నారు. ఈ తనిఖిలోబీసీ అభివృద్ధి అధికారి మల్లేశం, వార్డెన్లు రత్నం, రవీందర్, శుక్రవర్ధన్ రెడ్డి తదితరులు ఉన్నారు.



వసతిగృహ విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్



సర్వేను తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్

## పెంజర్లను తనిఖీ చేసిన కలెక్టర్

**కొత్తూర్, డిసెంబరు 19, ప్రభాతవార్త :** కొత్తూర్ మండల పరిధిలోని పెంజర్ల గ్రామాన్ని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందిరమ్మ ఇళ్లపై సర్వే నిర్వహిస్తున్న క్రమంలో గురువారం జిల్లా కలెక్టర్ పెంజర్ల గ్రామాన్ని సందర్శించారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేను, ఎలాంటి అవాంతరాలకు తావు లేకుండా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. అర్హుల ఎంపికలో పారదర్శకతను పాటించి, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలి అని అధికారులకు ఆదేశించారు. సర్వే ప్రక్రియను నిఖార్సుగా నిర్వహించి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసే దిశగా ఈ ప్రయత్నం కొనసాగుతుందన్నారు. సర్వే ప్రక్రియపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, సెక్రటరీ సురేందర్, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

# సర్వే, భూసేకరణకు ప్రజలు సహకరించాలి

**జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్,భూసేకరణ అధికారి శంకర్‌కుమార్**



భూసేకరణకు వివరాలు సేకరణ, సర్వేను పరిశీలించిన మేడ్చల్ జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్,భూసేకరణ అధికారి శంకర్‌కుమార్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 19, ప్రభాతవార్త**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలో రాజీవ్‌రహదారి రోడ్డు వెడల్పు కోసం జరుగుతున్న భూసేకరణ, సర్వే, రోడ్డుకు పక్కల ఉన్న భవనాల నిర్మాణాల కొలతలు, భూముల వివరాలు సేకరణ సర్వేలు జరుగుతున్నందున ప్రజలు సహకరించాలని మేడ్చల్ జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జిల్లా భూసేకరణ అధికారి కె.శంకర్‌కుమార్ కోరారు. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ఆ రోడ్డు వెడల్పునకు సంబంధించి సర్వేలు, కొలతలు, భూవివరాల సేకరణకు కొనసాగుతున్నట్లు పర్యటించి సర్వేలను పరిశీలించినట్లు ఈ విషయాలను ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగ మేడ్చల్ జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్,జిల్లా భూసేకరణ అధికారి కె.శంకర్‌కుమార్ మాట్లాడుతూ నగరంలోని ప్యారడైజ్ నుంచి తూంకుంట గ్రామ శివారు శామీర్‌పేట ఔటర్ రింగురోడ్డు సర్కిల్ వరకు సుమారు 18కిలోమీటర్ల వరకు రోడ్డు వెడల్పు 200ఫీట్లతో (రోడ్డు మధ్య నుంచి ఇరువైపుల 100+100ఫీట్లతో) ఎలివేటెడ్ రోడ్డు నిర్మాణం జరుగనున్నట్లు తెలిపారు. అయితే నగర పరిధిలో 6కిలోమీటర్ల దూరం, అదే విధంగ మేడ్చల్ జిల్లా పరిధిలో 12కిలోమీటర్ల మేర అల్వాల్, లోతుకుంట, హకీంపేట్, పోతాయిపల్లి, తూంకుంట గ్రామాలలో రోడ్డు వెడల్పు కోసం భూసేకరణకు ప్రభుత్వం గత నెల 17న నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఈ నెల 3వ తేదీన అల్వాల్, లోతుకుంట, హకీంపేట్, పోతాయిపల్లి, తూంకుంట గ్రామాల్లో రోడ్డు వెడల్పు కోసం గ్రామసభలు కూడ నిర్వహించామన్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి భూసేకరణకు ఆయా గ్రామాల పరిధిలో భూముల సర్వేలు సర్వే అధికారులు సిబ్బంది చేయటం ఆరంభించారని అన్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది భూసేకరణకు యజమానుల నుంచి భూముల, ఆస్తికి సంబంధించి వివరాలు, ఆధార్, ఓటరు కార్డులు, రేషన్ ఇతర వివరాలను సేకరించటం జరుగుతుందన్నారు. అదే విధంగ రోడ్డుకు ఇరువైపుల ఉన్న భవనాలు, ఆస్తుల నిర్మాణాలను హెచ్‌ఎండిఏ అధికారులు కొలతలు చేస్తున్నారని అన్నారు. జిల్లా పరిధిలో ఐదు గ్రామాల పరిధిలో 329రోడ్డుకు ఇరువైపుల నిర్మాణాలు ఇళ్లు ఉన్నట్లు తెలిపారు. గురువారం వరకు 112 నిర్మాణాల కొలతలు పూర్తి జరిగినట్లు ఆయన తెలిపారు. లక్ష23వేల చ.గజాల స్థలం వరకు సర్వే పూర్తి జరిగిందన్నారు. హకీంపేట్‌లో ఆర్టీసికి సంబంధించి భూమి 1ఎకర25గుంటల భూమి రోడ్డులో పోతుందన్నారు. నిసాకు సంబం ధించిన భూమి 2ఎకరాల 9గుంటలు రోడ్డు వెడల్పుతో పోతుందన్నారు. తూంకుంట గ్రామ పరిధిలో దేవాలయాలు సాయిబాబ, దొంగలమైసమ్మలతో పాటు శ్మశానవాటిక (ఖబరస్తాన్)లలో కూడ భూములు రోడ్డులో పోతున్నా యన్నారు. అల్వాల్‌లో వీరాంజనేయస్వామి దేవాలయం, లోతుకుంటలో మహంకాళి ఆలయ కాంపౌండ్‌వాల్ రోడ్డు వెడల్పులో పోతుందన్నారు. రోడ్డు వెడల్పు కోసం జరుగుతున్న సర్వేలకు ప్రజలు సహకరించాలని, అదే విధంగ భూములు కోల్పోతున్న వారు యజమానులు పూర్తి వివరాలు భూములకు సంబంధించి స్థలం వాటితో పాటు ఇతర ఆదార్, ఓటరు కార్డుల, రేషన్‌కార్డుల, స్టడీ, ఇతర వివరాలను కూడ సంబంధిత అధికారులకు, సిబ్బందికి వివరించాలని జిల్లా భూసేకరణ అధికారి శంకర్‌కుమార్ కోరారు.

## ఆన్‌లైన్ బారిన పడి మోసపోవద్దు

**శంకర్‌పల్లి, డిసెంబరు 19, ప్రభాతవార్త:** విద్యార్థులు పట్టుదల క్రమశిక్షణతో చదువు పట్ల దృష్టి సారించాలని చదువుతోపాటు ఆటపాటల్లో రాణించాలని మోకిల ఏఎస్ఐ పద్మ అన్నారు. గురువారం శంకర్‌పల్లి మండల పరిధిలోని మహారాజ్ పేట్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైబర్ క్రైమ్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ పద్మ మాట్లాడుతూ విద్యార్థినిలు మహిళలు భయపడకుండా తమను ఎవరైనా వేధిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. విద్యార్థినిలను, మహిళలను ఆకతాయిలు ఎవరైనా వేధిస్తే 1930నకు కాల్ చేయాలని మోకిల ఏఎస్ఐ పద్మ అన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన వారి పేరు గోప్యంగా ఉంచబడుతుందని, అదే విధంగా సెల్ ఫోన్లలో, ఇన్‌స్టాగ్రాం, వాట్సాప్, ఫేస్బుక్ లాంటి వాటిలలో పరిచయం లేని వ్యక్తులతో చాటింగులు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో పిఎస్ఐ శివాని, ప్రధానోపాధ్యాయులు అంజయ్య ఉన్నారు.

## రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న సుదర్శన్‌గౌడ్, సాయితేజేశ్వర్

**కొత్తూర్, డిసెంబరు 19, ప్రభాతవార్త :**

కొత్తూర్, కుమ్మరిగూడ వెళ్లే రహదారి శరవేగంగా రోడ్డు పనులు చేపట్టారు. కొత్తూర్ పురపాలక పరిధిలోని కొత్తూర్ నుండి కుమ్మరిగూడెం వెళ్లే రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చెరువుతో రోడ్డు నిర్మాణ పనులు శరీరకంగా జరుగుతున్నాయి. ఇట్టి పనులను గురువారం కొత్తూర్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జె.సుదర్శన్‌గౌడ్, స్థానిక కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కోశాధికారి చింతసాయి తేజేశ్వర్‌తో కలిసి రోడ్డు పనులను పరిశీలించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ....ప్రజల సమస్యను పరిష్కరించడమే మా లక్ష్యం. రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతతో, వేగంగా పూర్తవుతాయి. ప్రజల సహకారంతో ఈప్రాజెక్టును సమర్థవంతంగా ముగిస్తామన్నారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే ప్రజల రాకపోకలు సులభతరం అవుతాయని, ఆర్థిక కార్యకలపాలకు మెరుగైన అవకాశాలు లభిస్తాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ధరణి,సాయిబాబ, అయ్యప్ప, మంగళం కాటన్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు చేయబడవు

**వికారాబాద్, డిసెంబరు 19, ప్రభాతవార్త:** జిల్లాలోని ధరణి కాటన్ మిల్, శ్రీ సాయిబాబా కాటన్ మిల్, అయ్యప్ప కాటన్ మిల్లు, మంగళం కాటన్ మిల్, కోటిపల్లి, శ్రీ సాయిబాబా ఆగ్రో కమోడిటెస్ ధరూర్ మిల్లులలో అధిక మొత్తంలో పత్తి నిలువలు పేరుకుపోయాయని, శుక్రవారం పత్తి కొనుగోలు నిలిపివేస్తున్నామని జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి ఈ మిల్లులకు బదులుగా ఇతర మిల్లులకు పత్తి పంటను తరలించి విక్రయించుకోవాలని సూచించారు.

## ప్రభుత్వం ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలి



ధర్నాలో అభివాదం చేస్తున్న జీఎంపీఎస్ రాష్ట్ర కమిటీ నేతలు

**ధర్నాచౌక్, డిసెంబర్ 19, ప్రభాతవార్త:** గొల్ల కురుమలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలుచేయాలని జీఎంపీఎస్ రాష్ట్ర కమిటీ నేతలు డిమాండ్ చేశారు. గురువారం ఆ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేశించి వారు మాట్లాడుతూ గొల్ల కురుమలకు రెండు లక్షల నగదు బదిలీ ద్వారా రెండో విడత గొర్రెలు పంపిణీ చేస్తామని మోసం చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వం గొల్ల కురుమలను మోసం చేసినట్లే ఈ ప్రభుత్వం కూడా మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. దళారులు లేకుండా నగదు బదిలీ ద్వారా రెండవ విడత గొర్రెలు పంపిణీ చేయాలని, అన్ని రకాల మందులు, వ్యాక్సిన్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, పశువైద్యశాలలు పనివేళలు ఉదయం ఏడు గంటల నుండి ప్రారంభించేలా మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సంఘం నాయకులు కిల్లె గోపాల్, రవీందర్, మేకల కృష్ణయాదవ్, వివిధ వృత్తి సంఘాల నేతలు మల్లేశం, జి.నాగరాజు, బి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## బధిర విద్యార్థులకు హాస్టళ్లు ఏర్పాటు చేయాలి

**-డీఎస్డి రాష్ట్ర అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్, ఉపాధ్యక్షుడు కాటమోని వెంకటేష్ గౌడ్**

**చిక్కడపల్లి డిసెంబర్ 19 (ప్రభాతవార్త ):** రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన నిరుపేద బధిరుల విద్యార్థులకు విద్యను అభ్యసించడానికి వీలుగా నగరంలోని మలక్ పెట్ ప్రాంతంలో ఉన్న వికలాంగుల సంక్షేమ భవనం ఆవరణంలో ఇంటర్, డిగ్రీ కళాశాల హాస్టళ్లు ఏర్పాటు చేయాలనీ డెవలప్ మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్, ఉపాధ్యక్షుడు కాటమోని వెంకటేష్ గౌడ్ కోరారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర సచివాలయంలో వికలాంగుల సంక్షేమ శాఖ కార్యదర్శి సినీతా రామచంద్రన్ ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ విధంగా హాస్టళ్లు, కళాశాలలు లేకపోవడం వాళ్ళ వీరంతా మధ్యలోనే చదువును మానివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. రాష్ట్ర స్థాయిలో ఉన్న దివ్యాంగుల రాష్ట్ర కమిషనర్, డైరెక్టర్ పదవులను వికలాంగులనే నియమించాలని డిమాండ్ చేసారు. ఈ విధంగా నియమించడం వల్ల ఆ వర్గాలకు సరైన న్యాయం జరుగుతుందని అన్నారు. వెంటనే స్పందించిన సునీతా రామచంద్రం తప్పకుండ న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

## అయ్యప్ప స్వామి దేవస్థానం 16వ వార్షికోత్సవం



మండల పూజ మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటిమేయర్ బోరబండ కార్పోరేటర్ బాబాఫసియుద్దీన్.

**యూసుఫ్‌గూడ, డిసెంబరు 19, ప్రభాతవార్త**

బోరబండ ఎన్ఆర్ఆర్‌పురం సైట్ 2లోని శ్రీశ్రీశ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానం 16వ వార్షికోత్సవ మండల పూజ మహోత్సవ కార్యక్రమాలు 3రోజుల పాటు జరుగనున్న సందర్భంగా బోరబండ అయ్యప్ప స్వామి ఆలయ కమిటి అధ్యక్షులు జి.లక్ష్మణ్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందుకు గాను గురువారం గ్రేటర్ మాజీ ఉపమేయర్ బోరబండ కార్పోరేటర్ బాబాఫసియుద్దీన్ చేతుల మీదుగా వార్షికోత్సవ మండలపూజ మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

## బిజెపిని బలోపేతం చేయడమే లక్ష్యం

**-సుభాష్ చంద్రబోస్ బస్తిలో బూత్ కమిటీ ఎన్నిక**





**అత్తాపూర్ డిసెంబరు19,ప్రభాతవార్త :**

బిజెపిని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి ,జిల్లా సెక్రెటరీ కొమురయ్యలు పేర్కొన్నారు.గురువారం అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ సుభాష్ చంద్రబోస్ బస్తిలో గల బూత్ నంబర్ 207 లో శక్తి కేంద్రం ఇంచార్జ్ రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి సూల్గ వెంకటేష్ ఆధ్వర్యంలో బూత్ కమిటీ వేశారు. ఈ మేరకు బూత్ కమిటీ అధ్యక్షుడిగా ఎం.రాకేష్ సెక్రటరీగా ధనంజయలను నియమించారు. ఈ సందర్భంగా పలువరు బిజెపి నాయకులు మాట్లాడుతూ....రాష్ట్రంలో బిజెపి వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారని రాబోయే ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వం రాబోతుందని జోష్యం చెప్పారు.ప్రతి ఒక్క నాయకుడు,కార్యకర్త కష్టపడి పని చేసి పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ప్రధాని నరేంద్రమోడీ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు.పార్టీ బలోపేతానికి నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి జిల్లా సెక్రెటరీ కొమురయ్య,బూత్ సభ్యులు జయానంద్ రెడ్డి చంద్రపాల్ ఎన్ రమేష్ శ్రీకాంత్ ఆర్ జగన్ బి భరత్ బి వినయ్ అఖిల్ సోమనాథ్ బి రాజు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల సర్వేను తనిఖీ చేసిన జోనల్ కమిషనర్



**అత్తాపూర్ డిసెంబరు19,ప్రభాతవార్త :**

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జోనల్ కమిషనర్ వెంకన్న అధికారులకు సూచించారు.గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్‌లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సర్కిల్ డిసి రవి కుమార్‌తో కలిసి వెంకన్న తనిఖీ చేసి సిబ్బంది పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రతిష్టంగా నిర్వహించి అర్హులైన వారికి ఇళ్లు వచ్చే విధంగా చూడాలని అర్హులను వారి వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని సూచించారు.ఇళ్లు లేని నిరుపేదలు తమ పేర్ల అధికారులతో నమోదు చేయించుకోవాలని సూచించారు.



నిరసన తెలుపుతున్న నాయకులు



కేంద్రమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న కాంగ్రెస్ నేతలు జగదీశ్వర్ గౌడ్, జైపాల్ తదితరులు



నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ ప్రతినిధులు



కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

## అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

**జగద్గిరిగుట్టలో..**

**జగద్గిరిగుట్ట, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** అంబేద్కర్ పై అమిత్ షా చేసిన వాక్యాలను ఉపసంహరించుకోవాలని సిపిఐ,దళిత సంఘాల నాయకుల డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో హోమ్ మంత్రి అమిత్ షా ప్రతిసారి అంబేద్కర్ పేరు ఎందుకు తీసుకుంటున్నారు, వారికి అంబేద్కర్ పైన ఉన్న వ్యతిరేకతకు నిదర్శనమని, వెంటనే ఆ వాక్యాలు ఉపసంహరించుకోవాలని కోరుతూ గురువారం జగద్గిరిగుట్ట చివరి బస్టాప్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి అమిత్ షా చిత్రపటాలను తగలపెట్టడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్, రాష్ట్ర నాయకులు ఏసురత్నం మాట్లాడుతూ హోమ్ మంత్రి అమిత్ షా అంబేద్కర్ ను పదులు సార్లు కాదు ప్రతిసారి అంబేద్కర్ గురించి మాట్లాడుతామని, అమిత్ షా తన వాక్యాలను ఉపసంహరించుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి దళిత హక్కుల రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాములు అధ్యక్షతన, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సయ్యద్ రషీద్, పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు బాబు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, ఏఐటీయూసీ అధ్యక్షుడు హరినాథ్, శాఖ కార్యదర్శి సహదేవ్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేష్, దళిత సంఘాల నాయకులు నర్సింహా, సోమన్న, సోమయ్య, సామెల్, బాలాజీ, ఇమామ్, ఆశప్ప తదితరులు పాల్గొన్నారు.

**చందానగర్‌లో...**

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 19 ప్రభాతవార్త :** భారత రాజ్యాంగ నిర్మాత, బాబా సాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై కేంద్రహోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలు బీజేపి అహంకారానికి నిదర్శనమని,అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ డిమాండ్ చేశారు. కేంద్రమంత్రి అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు శేరిలింగంపల్లి కాంగ్రెస్‌పార్టీ నియోజక వర్గ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో చందానగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు సయ్యద్ గౌస్, మన్నెపల్లి సాంబశివరావు,డివిజన్ అధ్యక్షులు అలీ, కట్ల శేఖర్‌రెడ్డి, కటికె రాజు, సూరిరాథోడ్, సుధాకర్, కృష్ణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మధు,జెరిపేటి రాజేశ్, రాము గౌడ్, యాదయ్య, అక్బర్,హనీఫ్ ,పద్మారావు, సాధిక్, శివకుమార్, నర్సింగరావు,మహిళలు పార్వతి,శాంత తదితరులు పాల్గొన్నారు.

**కెవిపిఎస్ ఆధ్వర్యంలో...**

**చిక్కడపల్లి డిసెంబరు 19 ప్రభాతవార్త:** రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన అవమానకరమైన వ్యాఖ్యలపై ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని అతని పై ఎస్సి ఎస్టీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ భారీ నిరసన చేపట్టింది అమిత్ షా ఖబడ్దార్‌ఏ-అంబేద్కర్ జిందాబాద్ రాజ్యాంగం వర్ధిల్లాలి అంటూ కేవీపీఎస్ నాయకులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. గురువారం సుందరయ్య పార్క్ వద్ద కేవిపిఎస్ ఆధ్వర్యంలో అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ ప్లకార్డులు జెండాలు చేబూని భారీ నిరసన చేపట్టారు కేవీపీఎస్ నగర అధ్యక్షులు ఎం దశరథ్ అధ్యక్షత వహించి ఈ కార్యక్రమంలో టి పి ఎస్ కె రాష్ట్ర కన్వీనర్ జి రాములు, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు జాన్ వెస్లీ టి స్కైలాబ్ బాబు తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్ లు ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఎం దశరథ్ బి సుబ్బారావు కేవీపీఎస్ వివిధ ప్రజాసంఘాల నాయకులు కె రమేష్ జి రాములు కృష్ణ ప్రసాద్ శంకర్ ప్రేమ రజిత లక్ష్మి జగదీష్ మల్లేష్ శ్రీరాములు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

**లాల్‌దర్వాజ చౌరస్తాలో...**

**చార్మినార్,డిసెంబరు 19 ప్రభాతవార్త :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేర్కర్‌ను ఉద్దేశిస్తూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇంఛార్జి కె.వెంకటేష్ అన్నారు.డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం లాల్‌దర్వాజ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆయన దిష్టి బొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు కేంద్ర కేబినెట్ నుంచి అమిత్ షాను వెంటనే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాన ఎస్సీ,ఎస్టీ ఐక్య వేదిక అధ్యక్షులు బుంగ శివ కుమార్, కాంగ్రెస్ నాయకులు తిరుపతి చంద్రశేఖర్,దినేష్ బిడ్ల,కె. సురేష్ బాబు,దల్లు శివ,శ్రీ కాంత్ కాగడ.జి. నరసింహ, అస్లాం,బిలాల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## వర్గీకరణ,క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా పోరాటం : వడ్లమూరి కృష్ణ స్వరూప్

**చిక్కడపల్లి డిసెంబర్ 19 (ప్రభాతవార్త) :** వర్గీకరణ. క్రిమిలేయర్ కు వ్యతిరేకంగా దోపిడీ పాలకులు పైన పోరాటం చేయకపోతే భవిష్యత్తు లేదని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ అన్నారు. వర్గీకరణ చేపడితే చంద్రబాబు. పవన్ కళ్యాణ్. బీజేపీ విదీతి సర్కార్ పైన తిరుగుబాటు చేస్తామని.. మీ మనువాద పార్టీ లను భూస్థాపితం చేయాలని పిలుపు ఇచ్చారు. గురువారం వర్గీకరణ. క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా దళిత బహుజన పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దాసరి అన్నపూర్ణ గారి ఆధ్వర్యంలో జరిగిన సభలో ముఖ్య అతిధిగా కృష్ణ స్వరూప్ పాల్గొని ప్రసంగించారు. రాజ్యాంగం నకు ఆర్టికల్ 341 ,342 కు వ్యతిరేకంగా వర్గీకరణ. క్రిమిలేయర్ మీద ఆగస్టు 1 వ తేదిన సుప్రీం కోర్ట్ ఇచ్చిన తీర్పు పైన పార్లమెంట్ లో చర్చ జరగాలని నరేంద్ర మోడీ బీజేపీ సర్కార్ ను డిమాండ్ చేసారు. జాతీయ ఎస్సీ కమిటీ సలహాలు ఆర్టికల్ (338 )లేకుండా ర్నాష్ట్ర లో వర్గీకరణ కోసం ఏక సభ్య కమిషన్ వేసే అధికారం చంద్రబాబు ప్రభుత్వం నకు లేదని, కావున జి.ఓ 86 ను రద్దు చేయాలని డిమాండ్ చేసారు. డాక్టర్. అంబేద్కర్ గారి ఆశయాలు సాధన కోసం.. . మాలమహానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్. వి. ఎల్. రాజు.ఏపీ రాష్ట్ర శాఖ అధ్యక్షులు ఎస్. శ్యాం ప్రసన్న కుమార్ రాష్ట్ర అధికార ప్రతినిధి బోడపాటి రమణ బాబు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ల రమేష్.ఉమ్మడి కృష్ణ జిల్లా అధ్యక్షులు పంతగాని సురేష్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ జిలాని.పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ ఉప్పాడ. రామచంద్రరెడ్డి.రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి గుమ్మడి మహాలక్ష్మి.పార్టీ ఎన్టీఆర్ జిల్లా ఇంచార్జ్ ఎస్. ఆంజనేయకుమార్. పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకులు పి. రాజలింగం. అర్చన. ఎస్సీ. ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు గవ్వల శ్రీకాంత్. నాయకులు ఎమ్. లావణ్య.లూద్. మేరీ. బడుగు అచ్చరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న డిబిపి జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్

# విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరిస్తే సహించేది

**హైదరాబాద్, డిసెంబరు 19,ప్రభాతవార్త:**

విద్యుత్ సంస్థలు ప్రైవేటీకరణ చేస్తే సహించేది లేదని దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటి చైర్మన్ సాయిబాబా, కన్వీనర్ రత్నాకర్‌రావు తెలిపారు. నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజనీర్స్ (ఎన్‌సిసిఓఈఈఈ) పిలుపుమేరకు గురువారం జేఏసీ ఆధ్వర్యంలో మింట్ కాంపౌండ్‌లోని కార్పొరేట్ ఆఫీస్ ముందు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా చైర్మన్ సాయిబాబా మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్, చండీగఢ్ రాష్ట్రాల విద్యుత్ సంస్థలను ప్రైవేటు పరం చేయాలని కేంద్రం భావిస్తుందని దాన్ని తప్పకుండా అడ్డుకుంటామన్నారు. ఆయా రాష్ట్రాల ఉద్యోగులకు మద్దతుగా తాము ఈ ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. ఈనెల 14, 15వ తేదీన నాగపూర్ లో జరిగిన అల్ ఇండియా ఎంప్లాయిస్ ఫెడరేషన్ మీటింగ్లో దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలో నైనా విద్యుత్ రంగాన్ని ప్రైవేటకరిస్తే ఆ రాష్ట్రాలకు మద్దతుగా అన్నిరాష్ట్రాలు నిలవాలని ఆందోళన కార్యక్రమం చేయాలని నిర్ణయించామని తెలిపారు. కన్వీనర్ రత్నాకర్ రావు మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్, చండీగఢ్ విద్యుత్ సంస్థ ప్రైవేటీకరణ నిర్ణయం వల్ల దేశంలో ఉన్న 27 లక్షల మంది ఉద్యోగులు నిరసన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. యుపిలో ఉద్యోగులపై యస్మాప్రకటించినా గాంధీయ మార్గంలో నిరసనలు తెలుపుతున్నారన్నారు. ఈకార్యక్రమంలో జేఏసీ నాయకులు వజీర్, ఈశ్వర్ గౌడ్, నెహ్రూ, నాగ తులసిరాణి, సదానందం, శ్రీనివాస్ రెడ్డి, జనప్రియ, వేణు, వర ప్రసాద్, బాలకృష్ణ, విద్యాసాగర్, సుధీర్, కిరణ్, బుచ్చయ్య, కైలాస్, అశోక్, కిషోర్, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.





టిజిఎస్‌పిడిసిఎల్ ముందు నిరసన తెలుపుతున్న ఇంజనీర్లు

## దారిదోపిడీకి పాల్పడిన నిందితులు రిమాండ్‌కి తరలింపు..

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

చెడు వ్యసనాలకు అలవాటు పడి దారిదోపిడికి పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసిన సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. బాలనగర్ ఎసిపి హనుమంతరావు తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రం చెందిన షేక్ సమీర్ (22) ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. నగరంలోని గోల్కొండ ప్రాంతానికి చెందిన మహమ్మద్ హుస్సేన్ (19)లు స్నేహితులు సమీర్ షాపూర్ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇరువురు కలిసి సులభంగా డబ్బు సంపాదించి జల్సాలు చేయాలని ఆలోచనతో దారిదోపిడికి పాల్పడుతున్నారు. ఈ క్రమంలోని ఈనెల 5వ తేదీన చింతల్ పద్మారావు నగర్ ఫేస్ 2కు చెందిన సతీష్ పంజాగుట్ట ఎల్ఐసి కార్యాలయంలో పనిచేస్తూ విధులు ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో బాలానగర్‌లోని ఉషా ప్యాన్ కంపెనీ సమీపంలోకి రాగానే సమీర్, మహమ్మద్ హుస్సేన్‌లు తన ద్విచక్ర వాహనాన్ని సతీష్ నడుపుతున్న ద్విచక్ర వాహనానికి అడ్డుతగిలారు. దీంతో సతీష్ కింద పడిపోవడంతో అతని వద్ద ఉన్న 2సెల్ ఫోన్లతో పాటు 2.63 గ్రాముల బంగారు గొలుసును దొంగతనం చేసి అక్కడి నుంచి పారిపోయారు. దీంతో మరుసటి రోజు సతీష్ బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న బాలానగర్ పోలీసులు దర్యాప్తులో భాగంగా సుమారు 50 సీసీ కెమెరాల ఫుటేజ్‌ని పరిశీలించడంతోపాటు కాల్ రికార్డులను సేకరించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టగా చేసిన నేరాన్ని అంగీకరించారు. దీంతో వారి వద్ద నుంచి 2సెల్ ఫోన్లతో పాటు బంగారు గొలుసును స్వాధీనం చేసుకొని గురువారం ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

## కెటిఆర్‌పై కేసులు నమోదు అన్యాయం

**: బిఆర్ఎస్ సీనియర్ నేత రవీందర్‌యాదవ్**

**శేరిలింగంపల్లి,డిసెంబర్ 19 ప్రభాతవార్త**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని బీఆర్ఎస్ సీనియర్ నేత రవీందర్‌యాదవ్ మండిపడ్డారు. కేటీఆర్‌పై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని విరుచుకుపడ్డారు. ఫార్ములా ఈ కార్ రేసుతో హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచారన్నారు. అయితే కాంగ్రెస్ సర్కార్ దానిని జీర్ణించుకోలేక లేనిపోనివి సృష్టించి బద్నాం చేసే కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. అసెంబ్లీ వేదికగా కేటీఆర్ సవాల్ విసిరారని, కాని కాంగ్రెస్ భయపడి చర్చ పెట్టకుండా పారిపోయిందన్నారు. అసెంబ్లీలో చర్చ పెడితే ప్రజలకు అన్ని విషయాలు తెలుస్తాయన్నారు. ఎక్కడ నిజాలు ప్రజలకు తెలిసిపోయి కాంగ్రెస్ కుట్రలు బయటపడతాయని, అందుకు చర్చ పెట్టకుండా తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. కేటీఆర్‌పై అన్యాయంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయించారని, ఇది ముమ్మాటికి కుట్రపూరితమేనని ఆయన విమర్శించారు. ఓఆర్ఆర్‌పై సిట్ విచారణ అంటూ సీయం రేవంత్‌రెడ్డి ప్రకటించటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఔటర్ టెండర్‌ల విషయంలో అవకతవకలు జరగలేదని, చట్ట ప్రకారంగా గత ప్రభుత్వం ముందుకు వెళ్లినట్టుగా తెలిపారు. కాంగ్రెస్ పార్టీ,సీయం రేవంత్‌రెడ్డి చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్ నిరంకుశ పాలనపై పోరాడేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్దంగా ఉందన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు తరిమి,తరిమి కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. రానుంది బీఆర్ఎస్ సర్కారేనని రవీందర్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు.

**మానసిక ఉల్లాసానికి సంగీతం దోహదం : నిర్మాత రాంకీ**

**చిక్కడపల్లి, డిసెంబరు 19 ప్రభాతవార్త:** మానసిక ఉల్లాసానికి సంగీతం దోహదపడతాయని ప్రముఖ సినీ నటుడు, నిర్మాత రాంకీ అన్నారు. రిషి మ్యూజికల్ ఈవెంట్స్ తృతీయ వార్షికోత్సవ వేడుకలు చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాంకీ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈసీ మ్యూజికల్ ఈవెంట్స్ సంస్థ అధ్యక్షురాలు యోగిత అక్కిరాజు మూడు సంవత్సరాల కాలంలోనే అనేకమంది గాయకులను తమ సంస్థ ద్వారా ప్రోత్సహించడం అభినందనీయమన్నారు.ఈ సందర్భంగా 2025 సంవత్సరంలో రిషి మ్యూజికల్ ఈ వెంట్ నిర్వహించనున్న ప్రోగ్రాం క్యాలెండర్ ను అతిథుల చేతుల మీదు గా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో ఎస్ పిబి గుడూరు శ్రీనివాస్ (యూఎస్ఏ), లిటిల్ మ్యూజిక్ అకాడమీ చైర్మన్ కొమండూరి రామాచారి, ప్రముఖ గాయకుడు త్రినాధరావు, మల్లెల కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షురాలు మల్లెల వసుంధర, ప్రముఖ సం ఖ్యాశాస్త్ర నిపుణులు దైవజ్ఞ శర్మ, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ గ్రహీత ఇందు నయన, సినీ నేపథ్యగాయని కీర్తి పాల్గొన్నారు.

ప్రముఖ గాయని యోగితా అక్కిరాజు నిర్వహణలో గాయని, గాయకులు ఆల పించిన సినీ గీతాలు అలరించాయి.

## స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 అవార్డు అందుకున్న కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి





ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి దృశ్యం.

**నార్సింగి, డిసెంబర్ 19 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా గండిపేట మండల పరిధిలో ఉన్న నార్సింగి మున్సిపాలిటీకి ఉత్తమ మున్సిపాలిటీ అవార్డు వచ్చింది. స్వచ్ఛ భారత్ మిషన్ 2.0లో భాగంగా చేంజ్ మేకర్స్ కాంక్లేవ్ విభాగంలో నార్సింగి మున్సిపాలిటీకి వచ్చిన అవార్డును గురువారం కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి ఢిల్లీ వేదికపై అందుకున్నారు. ఈ సందర్భంగా నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ చైర్మన్ గోపాల విజయ్‌బాబు, కౌన్సిలర్లు, అధికారులు కమీషనర్ కృష్ణ మోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, కార్మికుల సమిష్టి కృషి ఫలితంగానే నార్సింగి మున్సిపాలిటీకి అవార్డు వచ్చిందని వివరించారు. ఈ అవార్డు మన మున్సిపాలిటీ బాధ్యతను మరింత పెంచిందని, శానిటేషన్ విభాగంలో మరింత పటిష్టమైన చర్యలు తీసుకుంటామని కమీషనర్ స్పష్టం చేశారు. ప్రజలంతా తమ ఇళ్లలోని తడి,పొడి చెత్తను ఆటోల్లోనే వేసి అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. చెత్త నుంచి సేంద్రీయ ఎరువును తయారు చేసి మొక్కల పెంపకం దారులకు విక్రయించి మున్సిపల్‌కు ఆదాయంను సమకూర్చబోతున్నామన్నారు. పచ్చనదం, పరిశుభ్రతలే ఈ అవార్డు వచ్చేందుకు దోహదం చేశాయని కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి వివరించారు.

## అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు : కమిషనర్

**నార్సింగి, డిసెంబర్ 19 ప్రభాతవార్త :** ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు లోబడి ఉన్న అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ కమీషనర్ శరత్‌చంద్ర పేర్కొన్నారు. గురువారం కార్పోరేషన్ పరిధిలోని 11,19,20.వ డివిజన్ల పరిధుల్లోని ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను కమీషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుందని, అందరూ నిబంధనలకు లోబడి ఉన్న వారినే ఎంపిక చేస్తామన్నారు. ఏ రాజకీయ నాయకుడి ఒత్తిడికి తలొగ్గేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపికను త్వరలోనే పూర్తి చేసి, ఇళ్లు లేని పేదలందరికి ఇళ్లు వచ్చేలా పని చేస్తున్నామని కమిషనర్ శరత్‌చంద్ర వివరించారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్లు మహిపాల్‌రెడ్డి, పూర్ణ, సైదులు తదితరులు పాల్గొన్నారు.

**ఎపి మంత్రి అనగాని సత్యప్రసాద్‌గౌడ్‌ను కలిసిన తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ ప్రతినిధులు**



ఎపి మంత్రి అనగాని సత్యప్రసాద్‌గౌడ్‌ను కలిసిన గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ ప్రతినిధులు బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్, అయిలి వెంకన్నగౌడ్, ఎలికట్టే విజయ్‌కుమార్‌గౌడ్‌లు

**హైదరాబాద్, డిసెంబరు 19, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ గౌడ్‌ను గురువారం తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్ గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ కమిటీ చైర్మన్ ఎలికట్టే విజయ్‌కుమార్‌గౌడ్‌లు కలిశారు. ఈ సందర్భంగా ఉభయ రాష్ట్రాల్లో కల్లుగీత వృత్తి తదితర అంశాలపై మాట్లాడారు.అనంతరం వారు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు కల్లు గీత గౌడ కులం తమ కల్లుగీత వృత్తి,మద్యం అమ్మకాలు చేసుకోవడం ఆనవాయితీ వచ్చిందన్నారు.అయితే విడిపోయినా అన్నదమ్ముల మధ్య ఉన్న అనుబంధంతో రెండు రాష్ట్రాలలో గౌడ కులానికి అండగా ఉండి అభివృద్ధికి కృషి చేయాలని కోరడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రాంతాలుగా వేరుగా ఉన్న జాతి కోసం కలిసి పనిచేద్దామన్నారు.మీరు తెలంగాణ రాష్ట్రంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయం కోసం,జాతి పురోగతి కోసం పనిచేస్తున్నారని,అలాగే ఏపీలో కూడా చాల చేయాల్సి ఉందన్నారు. తెలంగాణలో వైన్స్ లలో గౌడ్స్‌కు రిజర్వేషన్లు కల్పిస్తున్నారని, అలాగే ఏపీలోనూ వైన్ షాపులలో కల్లుగీత వృత్తిదారులకు 10శాతం రిజర్వేషన్లు ఇస్తున్నామని పేర్కొన్నారు.

## రంగస్థలనాటక కళారూపాల్ని భవిష్యత్‌తరాలకు అందిస్తాం



అలేఖ్య పుంజాలకు వినతిపత్రం అందజేస్తున్న రాంచందర్, దుర్వాసరాజు, సదానందం, అంజిరెడ్డి, అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు

**రవీంద్రభారతి, డిసెంబరు 19 ప్రభాతవార్త :**

రాష్ట్రవ్యాప్తంగా రంగస్థల నాటక కళారూపాల ప్రదర్శనలకు పడేపాట్లు, కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తనకు తెలుసునని, వీటిని పరిష్కరిస్తూ నాటక కళారూపాల్ని భవిష్యత్తు తరాలకు అందించే విధంగా తాను కృషిచేస్తానని తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు ఆచార్య అలేఖ్య పుంజాల అన్నారు. ఈమేరకు రవీంద్రభారతిలోని సమావేశం మందిరంలో తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య (తెనాసస) రాష్ట్ర కార్యవర్గం, జిల్లాల ప్రతినిధులతో గురువారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పౌరాణిక, చారిత్రక, పద్యనాటక సంస్థలతోపాటు సాంఘిక నాటకాలు ప్రదర్శించే వారికి ప్రభుత్వపరంగా ప్రోత్సాహం అందించడంపై చర్చ జరిగింది. తెనాసస వ్యవస్థాపక అధ్యక్షుడు తడకమళ్ల రాంచందర్‌రావు, రాష్ట్రాధ్యక్షుడు సదానందం, రాష్ట్ర ప్రచార కార్యదర్శి వి.దుర్వాసరాజు, ఉపాధ్యక్షుడు సోమా అంజిరెడ్డి, జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్న ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని కళాకారులందరికీ గుర్తింపు కార్డులు, వృద్ధకళాకారులకు పింఛను ఇవ్వాలని, గ్రామీణ నాటక సంస్థల ప్రదర్శనలకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. నాటకరంగాన్ని పదిలం చేసేందుకు ప్రభుత్వం తరఫున ప్రోత్సాహాన్ని కోరుతూ 50 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అలేఖ్య పుంజాలకు అందజేశారు.

## కూకట్‌పల్లిలో ఘనంగా క్రిస్మస్ సంబరాలు



భక్తి గీతాలు అలపిస్తున్న భక్తులు

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

గ్రాండ్ క్రిస్మస్, మెగా క్రిస్మస్, సెమీ క్రిస్మస్ పేరుతో నిర్వహిస్తున్న వేడుకల్లో చిన్నా పెద్ద తేడా లేకుండా పాల్గొని సందడి చేస్తున్నారు. కూకట్‌పల్లి భాగ్యనగర్ సెంట్రల్ చర్చ్‌లో పది రోజుల పాటు క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే గురువారం బిసిసీ ఫెస్ట్ 2024 పేరుతో జరిగిన వేడుకల్లో ప్రముఖ దైవజనులు రెవరెండ్ జి.డేవిడ్ ప్రశాంత్ పాల్గొని క్రిస్మస్ పండుగ సందేశాన్ని తెలియజేశారు. బీసీసీ మినిస్ట్రీస్ అధ్యక్షులు, సీనియర్ సంఘ కాపరి డాక్టర్ విప్పర్తి అధ్యక్షతన ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అందాల తార అరుదెంచే నాకై అంబర వీధిలో శ్రీ యేసుండు జన్మించే రేయిలో ఓ సద్భక్తులారా లోక రక్షకుండు అంటూ భక్తి గీతాలు పాడుతూ ఆ ప్రాంతం ఏసుక్రీస్తు నామస్మరణతో మారు మ్రోగించారు. ఈ కార్యక్రమంలో నిర్మల శ్యాంబాబు, జాలీ సమ్, జిన్ని సామ్, జ్యోతిరావు, పాలిన ఎడిత్, మేరీ కంభం, శాలిని, మోనిక, నికిత, పాస్టర్ నంద ఇజ్రాయిల్, జకప్ రాజు తదితరులు ఉన్నారు.

## నవరసభరితం శ్రీకృష్ణ తులాభారం పద్యనాటకం

**రవీంద్రభారతి, డిసెంబరు 19 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, తెలంగాణ సంగీత నాటక అకాడమీ, తెలంగాణ నాటక సమాజాల సమాఖ్యల సౌజన్యంతో శివాని ఆర్ట్స్ అసోసియేషన్, రుద్రశివ సాంస్కృతిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో తొమ్మిది రోజులపాటు జరుగుతున్న తెలంగాణ రాష్ట్రస్థాయి పద్య నాటక పోటీల్లో 8వరోజు గురువారం ఎఐటిఎం హైదరాబాద్ వారిచే ముత్తురాజు సుబ్బారావు రచన, నామ చంద్రబాబు నాయుడు దర్శకత్వంలో రూపొందిన శ్రీకృష్ణ తులాభారం పౌరాణిక పద్యనాటక ప్రదర్శన నవరసభరితంగా ఆహుతులను మంత్ర ముగ్ధులను చేసింది. భగవద్గీత సత్సంగ్ ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం, తిరుప్పావై, విష్ణుసహస్ర నామ పారాయణం విచ్చేసిన అశేష ప్రేక్షకులను ఆధ్యాత్మికలోకంలో విహరింపజేశాయి. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు బాపనపల్లి పరమేశ్వర్, హరిప్రసాద్, సలహాదారు శివనారాయణ తదితరులు పాల్గొని కళాకారులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు, చిన్నారులకు ప్రశంసా పత్రాలను అందజేసి ఎంతగానో అభినందించారు.

## నేడే డయల్ యువర్ ఆర్.ఎం.

**కంటోన్మెంట్,డిసెంబర్ 19 ప్రభాతవార్త:** ఆర్టీసి సికింద్రాబాద్ రీజియన్ పరిధిలోని వివిధ బస్ రూట్లలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సలహాలు, సూచనలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య డయల్ యువర్ ఆర్.ఎం.కార్యక్రమం జరగనున్నట్లు ఆర్.ఎం.రాజశేఖర్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని 9959900808 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు.



## శ్రీనివాస్ యాదవ్‌ను పరామర్శించిన సినీ ప్రముఖులు

**తలకొండపల్లి, డిసెంబరు 19, ప్రభాతవార్త:** తలకొండపల్లి మాజీ ఎంపీపీ కల్వకుర్తి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సీఎల్ శ్రీనివాస్ యాదవ్ తండ్రి విశ్రాంత ప్రధానో ఉపాధ్యాయులు సి యల్ జంగయ్య యాదవ్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సినిమా డైరెక్టర్ అంజి శ్రీనివాస్ సినీ హీరో విశ్వ కార్తికేయన్ నిర్మాత రామాంజనేయులు తదితరులు వెల్జాల గ్రామంలోని శ్రీనివాస్ యాదవ్ ఇంటికి చేరుకొని ఆయనను పరామర్శించి ఓదార్చారు. అనంతరం జంగయ్య సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయనను పరామర్శించారు ఈ కార్యక్రమంలో గోద శ్రీరామ్ యాదవ్, పొద్దుటూరి రాజు,యాదయ్య,చంద్రయ్య గౌడ్, తిరుపతయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన



**తలకొండపల్లి, డిసెంబరు 19, ప్రభాతవార్త:** బీజేపీ నాయకులు కేంద్ర మంత్రి అమిత్ షా గారు భారత రాజ్యాంగా నిర్మాత అయినటువంటి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ గారిని కించపరిచే విధంగా మాట్లాడినందుకు తలకొండపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన తెలిపారు అనంతరం అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేశారు ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి గారు కిసాన్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్ రెడ్డి గారు డిసిసి జిల్లా అధ్యక్షులు మరియు ఆమనగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అంజయ్య గుప్తా గారు తాలూకా సోషల్ మీడియా ఇంచార్జ్ మరియు ఆమనగల్ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ ఎండి అజీమ్ గారు మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు చెన్నకేశవులు గారు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు శివ గౌడ్ గారు చంద్రధన గ్రామ మాజీ ఎంపిటిసి రాములు గారు రాంపూర్ గ్రామం మాజీ ఎంపిటిసి తిక్కల వెంకటయ్య గారు దేవుని పడకల్ మాజీ సర్పంచ్ శ్రీశైలం గారు కాంగ్రెస్ పార్టీ సీనియర్ డేవిడ్ గారు కాకి కృష్ణ గారు తుమ్మ నరసింహా గారు యాదగిరి గారు శీను మరియు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## తాండ్రవీరేందర్ రెడ్డి సేవలు మరువలేనివి

**మాజీ మంత్రి పి.శంకర్‌రావు**



వీరేందర్ రెడ్డికి నివాళులర్పిస్తున్న మాజీమంత్రి

**నందిగామ డిసెంబరు 19 ప్రభాతవార్త** బ్రతికినన్నాళ్లు తన జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేసిన మహనీయుడు తాండ్ర వీరేందర్ రెడ్డి అని, ఆయన ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని మాజీమంత్రి పి శంకర్ రావు అన్నారు. గురువారం కేశంపేట అమ్మాజీ జడ్పిటిసి సభ్యురాలు విశాలశ్రవణ్ రెడ్డి మామ,అడ్వకేట్ వీరేందర్ రెడ్డి ద్వాదశ దినకర్మలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నందిగామ మాజీ ఎంపీటీసీ కొమ్ము కృష్ణ, ఏఎంసి డైరెక్టర్ చాకలి నరసింహులు,సి.కృష్ణ, టైలర్ కృష్ణ, ఎర్రగారి రమేష్,జాంగారి రాములు, తదితరులు ఉన్నారు.

## మాలలను ముందస్తు అరెస్ట్ చేసిన పోలీసులు



మాల మహానాడు నాయకులను బైండోవర్ చేసిన పోలీసులు

**నందిగామ డిసెంబరు 18 ప్రభాతవార్త** ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా హలో మాల చలో అసెంబ్లీ ముట్టడి సందర్భంగా హైదరాబాద్ వెళ్తారనే నెపంతో నందిగామ పోలీసులు మాలలను ముందస్తు అరెస్ట్ చేశారు. గురువారం ఉదయం 5 గంటల కుఇంటి వద్ద పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు.అరెస్ట్ కాబడిన వారిలో మాల మహానాడు నాయకులు ఏకుల రవి, పబ్బతి కరుణాకర్,బిస బాలరాజ్,బీస నర్సింగ్ రావు తదితరులు ఉన్నారు.

## ముమ్మరంగా గృహలక్ష్మీ పథకం సర్వే



నందిగామలో గృహలక్ష్మి సర్వే నిర్వహిస్తున్న అధికారులు

**నందిగామ డిసెంబరు ప్రభాతవార్త** నందిగామ మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలలో భాగమైన గృహలక్ష్మి పథకం అర్హులైన నిరుపేదలకు వర్తింపజేసే క్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లిఖార్జున్ రెడ్డి గురువారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకం ప్రజల నుండి అపూర్వ స్పందన లభిస్తుందని నందిగామ కాంగ్రెస్ యువనేత శివగళ్ల సుమన్ ఆనందం వ్యక్తం చేశారు.

## యువ వికాసం కాదు.. యువ విద్రోహం

**ఏఐఎస్ఎఫ్ షాద్‌నగర్ ఇంచార్జి ఆకాష్ నాయక్**

**యువ వికాసం విద్యార్థులకు 5లక్షల విద్య భరోసా కార్డు ఎక్కడ..?**

**తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఎక్కడ..?**

**షాద్‌నగర్, డిసెంబరు 19 ప్రభాతవార్త :** యువ వికాసం పేరుతో విద్యార్థులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎలక్షన్ల ముందు ఇచ్చిన యువ వికాసం విద్యార్థులకు రూ.5లక్షల విద్య భరోసా కార్డు ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్ ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తప్పుపడుతూ ఎన్నికల సమయంలో రూ.5లక్షల విద్య భరోసా కార్డు ప్రకటించినప్పటికీ ఆ స్కీమ్ అమలులో లేదని విమర్శించారు. ప్రభుత్వం ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్ స్థాపిస్తామన్న హామీ నెరవేరలేదని, విద్యార్థుల స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, విద్యాశాఖ మంత్రిత్వం ముఖ్యమంత్రి వద్దే ఉండి కూడా ఈ సమస్య పరిష్కారం కావడం లేదని అన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం యువతను నిర్లక్ష్యం చేస్తూ, నిరుద్యోగ సమస్యను విస్మరిస్తున్నారని విమర్శించారు.



కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో నాయకుల నిరసన



ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న నేతలు



ఆమనగల్లులో అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

# అంబేద్కర్‌ను అవమానించడం తగదు

## కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వెంటనే క్షమాపణ చెప్పాలి

**షాద్‌నగర్, డిసెంబరు 19 ప్రభాతవార్త :** డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను విమర్శించే స్థాయి హోం మంత్రి అమిత్‌షాకు లేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. అమిత్‌షా రాజ్యసభలో చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్‌కు, అంబేద్కర్ సిద్ధాంతాలకు బీజేపీ వ్యతిరేఖమని, ఆయన రచించిన రాజ్యాంగాన్ని గౌరవించకూడదని మనుస్మృతి, ఆర్ఎస్ఎస్ భావజాతం అమిత్‌షాకు నేర్పుతుందని అన్నారు. దళితులను ఈసడించడమే పనిగా పెట్టుకున్న సంఘ్ పరివార్ దళితులకే కాదు, సామాజిక న్యాయం కోరుకునే వారందరికీ స్ఫూర్తి ప్రదాత డాక్టర్ అంబేద్కర్‌ను అవమానించడం చాలా సులువైన వ్యవహారంగా మారిందన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజ్యసభలో అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్ అనడం ఫ్యాషన్ అయిపోయింది.. ఇన్నిసార్లు భగవంతుడి పేరు తలిస్తే ఏడు జన్మల దాకా స్వర్గ ప్రాప్తి కలిగేది అని అన్నారన్నారు. అమిత్‌షా అంబేద్కర్ పేరు మీద చేసిన వ్యాఖ్యలు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు త్రివర్ణ పతాకం మీద, అశోక చక్రం మీద విశ్వాసం లేదని నిరూపించాయన్నారు. సంఘ్ పరివార్ అంబేద్కర్ ప్రధాన పాత్ర పోషించి రూపొందించిన భారత రాజ్యాంగం మీద ఇసుమంత గౌరవం కూడా లేదని అనేకసార్లు రుజువైందన్నారు. ఆర్ఎస్ఎస్ కార్యాలయం మీద 50 ఏళ్లపాటు త్రివర్ణ పతాకం ఎగరవేయడానికి నిరాకరించిందని, గాంధీ హత్య తర్వాత అప్పుడు కేంద్ర హోంమంత్రిగా ఉన్న సర్దార్ పటేల్ ఆర్ఎస్ఎస్‌ను నిషేధించారని గుర్తుచేశారు. తర్వాత అనేక వాగ్దానాలు చేస్తేనే గానీ ఆర్ఎస్ఎస్ మీద నిషేధం తొలగలేదన్నారు. భారత రాజ్యాంగానికి కట్టుబడి ఉంటామని ఆర్ఎస్ఎస్ హామీ ఇవ్వవలసి వచ్చిందన్నారు. ఆర్ఎస్ఎస్ నుండి వచ్చిన అమిత్ షా నోటికొచ్చినట్లు అంబేద్కర్ అని అయిదుసార్లు అని ప్రతిపక్షాల మీద విరుచుకుపడ్డారని, అమిత్‌షా ప్రతిపక్షాలను దుయ్యబట్టడానికే ఈ మాట ప్రస్తావించి ఉండవచ్చు కానీ ఈ క్రమంలో అంబేద్కర్‌ను తీవ్రంగా అవమానించారన్నారు.

### కొడంగల్ రూరల్‌లో..

**కొడంగల్ రూరల్,డిసెంబరు 19, ప్రభాతవార్త :** కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో కొడంగల్ తాలూకా అంబేద్కర్ సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షాకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశం చి కొడంగల్ తాలూకా అంబేద్కర్ సంఘల అధ్యక్షులు యు రమేష్ బాబు యూత్ కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ ఎం కృష్ణంరాజు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బుస చంద్రయ్య లు మాట్లాడుతూ మొన్న జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా గారు రాజ్యాంగం కల్పించిన హక్కు తోటి ప్రజల చేత ఎన్నుకోబడిన నాయకుడు గా ఉండి కూడా ఒక ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత అయినటువంటి బాబాసాహెబ్ అంబేద్కర్ గారిని అవమానపరిచే విధంగా మాట్లాడి నందుకు హోంమినిస్టర్ అమీషాను కేంద్రం మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని అమిత్ షా గారు వెంటనే క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని కి డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు రావులపల్లి హనుమంతు ఉద్యమకారుడు శ్రీనివాస్ అన్నారం సాయిలు ఏర్పుల మోహన్ చిన్నయ్య వెంకటయ్య పి వెంకటయ్య జి జగన్మోహన్ కాశీనాథ్ వెంకటయ్య రాము పకీరప్ప అంజి కామ్సన్పల్లి వెంకటయ్య పాల్గొన్నారు.

### ఆమనగల్లులో..

**ఆమనగల్లు, డిసెంబరు 19, ప్రభాతవార్త:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా అనుచిత ఆరోపణలు చేశారంటూ ఆమనగల్లు కాంగ్రెస్ పార్టీ నిరసన వ్యక్తం చేసింది. మండల పార్టీ అధ్యక్షుడు తెలగమళ్ళ జగన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిరసన చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. బాధ్యత కలిగిన పదవిలో ఉండి రాజ్యాంగ నిర్మాతను అవమా నించేలా మాట్లాడడం బీజేపీ పార్టీకి అంబేద్కర్ పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. సొంత రాజ్యాంగాన్ని అమలు చేయాలనే కుట్రతోనే అంబేద్కర్‌పై విషపూరిత ఆరోపణలు చేశారన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు బేషరత్తుగా క్షమాపణలు చెప్పి మంత్రి పదవి నుండి వైదొలగాలని జగన్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మానయ్య, విజయ్, ఖాదర్, కరీం, కృష్ణనాయక్, ఫరీద్,బాబా, జకురాం, దేవరశెట్టి మహేశ్, శ్రీను, నర్సింహ్మా తదితరులు ఉన్నారు.

### తాండూరులో..

**తాండూరు, డిసెంబరు 19, ప్రభాతవార్త :** అంబేద్కర్‌ను అవమానించడం తగదని బహుజన్ సమాజ్ పార్టీ నేతలు అన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో తాండూరులో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం తాండూరు నుండి హైదరాబాద్ వెళ్లిన నాయకులు ట్యాంక్‌బండ్ దగ్గర అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన వ్యక్తం చేశారు. పార్లమెంట్ సాక్షిగా డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌ను అవమాన పరుస్తూ మాట్లాడిన అమిత్‌షా అదే పార్లమెంట్ సాక్షిగా క్షమాపణ చెప్పాలనిడిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్, గుండెల్ ధర్మేందర్, జగన్, జిల్లా నాయకులు నరేందర్ ముదిరాజ్, సాయి, శివ తదితరులు పాల్గొన్నారు.

### అంబేద్కర్‌ను విమర్శిస్తే ఖబర్దార్

**షాద్‌నగర్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకుడు ఎర్రోళ్ల జగన్**

**షాద్‌నగర్, డిసెంబరు 19 ప్రభాతవార్త :** కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పైన పార్లమెంటులో అనిచిత వ్యాఖ్యలు చేయడం పట్ల షాద్‌నగర్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకుడు ఎర్రోళ్ల జగన్ మండిపడ్డారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం స్ఫూర్తితోనే కేంద్ర హోంశాఖ మంత్రిగా అయ్యారని మండిపడ్డారు. అంబేద్కర్ అన్ని వర్గాలకు సమన్యాయంగా రాజ్యాంగంలో పొందుపరిచారని గుర్తుచేశారు. ఆ రాజ్యాంగాన్ని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా గమనించి అమలు చేశారని అన్నారు. దేశంలో ఉన్న బడుగు, బలహీన వర్గాలు అంబేద్కర్‌ను దేవునిగా కొనియాడుతుంటే కేంద్ర బీజేపీ ప్రభుత్వం జీర్ణించుకోలేకపోతుందన్నారు. ఇప్పటికే భారతదేశంలో ఉన్న దళితులపైన బీజేపీ ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని అన్నారు. అంబేద్కర్‌పైన కానీ దళితులపైన గానీ అనుచిత వ్యాఖ్యలు చేస్తే బీజేపీ కేంద్ర ప్రభుత్వాన్ని దళిత సమాజం మొత్తం ఏకమై బీజేపీ పార్టీని బొంద పెడతామని ఎర్రోళ్ల జగన్ హెచ్చరించారు.



## పేద వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

**ఆమనగల్లు, డిసెంబరు 19, ప్రభాతవార్త:** శీతాకాలం దృష్టిలో పెట్టుకుని చలి నుండి వృద్ధులకు రక్షణ కల్పించేందుకు హైదరాబాద్ నగరానికి చెందిన అభయ ఫౌండేషన్ సేవా దృక్పథంతో ఉచితంగా దుప్పట్లు (రగ్గులు) పంపిణీ చేసింది. మండల పరిధిలోని సంకటోనిపల్లి, చింతలపల్లి, మంగళపల్లి గ్రామాలలో రాత్రి సమయంలో పర్యటించి రగ్గులు అందజేశారు. ప్రతి ఏడాది లాగే ఈఏడాది కూడా సేవా కార్యక్రమాలు చేపట్టామని, పట్టణాలతోపాటు పల్లెలకు సేవలందించాలనే ఆశయంతో ఆమనగల్లు మండల పరిధిలోని పలు గ్రామాల్లో పేద వృద్ధులను ఎంపిక చేసి ఉచితంగా రగ్గులు పంపిణీ చేసినట్లు అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాలచందర్ అన్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున రగ్గులు వారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయన్నారు. ప్రతిఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకుంటే నిరుపేదలకు మేలు చేకూరుతుందన్నారు. అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్య, వైద్యము, టెక్నికల్ కోర్సు వంటి సేవలను సమాజానికి అందిస్తున్నట్లు బాలచందర్ తెలిపారు. కాగా చలి తీవ్రతలో రగ్గులు పంపిణీ చేయడాన్ని ప్రజలు అభయ ఫౌండేషన్‌ను ప్రశంసలతో కొనియాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మల్లిఖార్జున్, శ్రీనివాస్, రంజాన్, ఆమనగంటి సంజీవ్‌కుమార్, రవి, భగవాన్‌రెడ్డి, రూపం వెంకట్‌రెడ్డి, నాగభూషణం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ(ఎం) మహాసభలను విజయవంతం చేయండి

**ఆమనగల్లు, డిసెంబరు 19, ప్రభాతవార్త:** ఆమనగల్లు మండల కేంద్రంలో డిసెంబర్ 22న భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ (ఎం) మొదటి ఏరియా మహాసభలు నిర్వహిస్తున్నట్లు సీపీఎం పార్టీ ఏరియా కన్వీనర్ కానుగుల వెంకటయ్య అన్నారు. మహాసభలకు కార్మిక, కర్షక, పేద, బడుగు, బలహీన, మధ్యతరగతి ప్రజల ప్రయో జనాలు, హక్కుల సాధన కోసం పోరాటాల ఉద్యమంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆయన తెలిపారు. గురువారం ఆమనగల్లు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వెంకటయ్య పలు సూచనలు, సలహాలు అందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాల పాలనపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు మహాసభలు దోహదపడుతాయని వివరించారు. కార్యక్రమంలో సీపీఎం ఏరియా కమిటీ సభ్యులు గుమ్మడి కుర్మయ్య, పిప్పల శివకుమార్, దుబ్బ చెన్నయ్య, పోచయ్య, పడకల్‌శాఖ కార్యదర్శి జిల్లెల పెంటయ్య తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న వెంకటయ్య

## బిజెపితోనే దేశాభివృద్ధి సాధ్యం : కౌన్సిలర్



బూత్ కమిటీ అధ్యక్షులను సన్మానిస్తున్న కౌన్సిలర్‌లు లక్ష్మణ్, దుద్దు కృష్ణయాదవ్

**ఆమనగల్లు, డిసెంబరు 19, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం దేశాభివృద్ధికి ఎంతగానో తోడ్పాడుతుందని ఆమనగల్లు మున్సిపాలిటీ 15వ వార్డు కౌన్సిలర్ చెక్కాల లక్ష్మణ్ అన్నారు. దేశాభివృద్ధి కేవలం భారతీయ జనతా పార్టీతోనే సాధ్యమని ఆయన పేర్కొన్నారు.ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామ 196వ బూత్ నూతన కమిటీని ఎంపిక చేశారు. కమిటీ ఎన్నికకు కౌన్సిలర్లు చెక్కాల లక్ష్మణ్, 2వ వార్డు కౌన్సిలర్ దుద్దు కృష్ణయాదవ్‌లు హాజరై కమిటీని ఎంపిక చేశారు. ఈమేరకు లక్ష్మణ్, దుద్దు కృష్ణయాదవ్ మాట్లాడుతూ నరేంద్రమోడీ నాయకత్వంలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపట్టి దేశ పురోగతికి పాటుపడిందని కొనియాడారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ పేరుతో ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు సాహసోపేతమైన చర్యలు తీసుకుంటుందన్నారు. మూడుసార్లు ప్రధానమంత్రి పదవి చేపట్టి చరిత్ర సృష్టించిన నరేంద్రమోడీ ప్రభు త్వం అనేక సంస్కరణలకు తెరలేపి దేశంలోని అనేక రంగాలను అభివృద్ధి నోచుకునేలా కృషి చేశాడన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను బీజేపీ ఎప్పటికప్పుడు తిప్పికొడుతూనే ఉందని లక్ష్మణ్ పేర్కొన్నారు. కాగా 196 బూత్ కమిటీ ఎన్నుకోగా అధ్యక్షుడిగా దుద్దు పాపయ్య, యూత్ అధ్యక్షుడిగా కదారి వీరేశ్‌లను నియమించారు. అనంతరం నూతన అధ్యక్షులను శాలువాతో సన్మానించారు. బూత్ స్థాయిలో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని లక్ష్మణ్ కోరారు. కార్యక్రమంలో దుద్దు యాదయ్య, కుమ్మరి పాండయ్య, దుద్దు నారాయణ, ఉప్పుల అల్లాజీ, సత్తుబజార్, కదారి బజార్, కుమ్మరి భాస్కర్, కావలి రమేశ్, జంతుక ఐలయ్య, జంతుక రమేశ్, మంది చందు, కటిక ఐలయ్య, పల్లె నరసింహ్మా, మల్లేశ్, పర్వతాలు, హరిదాసు, శ్రీశైలం, అల్లాజీ, మహేందర్, కృష్ణ, రామచంద్రయ్య తదితరులు ఉన్నారు.

## నేడు డయల్ యువర్ డిఎం

**ఇబ్రహీంపట్నం, డిసెంబరు 19, ప్రభాతవార్త :** నేడు "డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ వెంకటనరసప్ప తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని ఆయన చెప్పారు. డిపో పరిధిలోని ప్రయాణికులు తమ సమస్యలను నేరుగా తెలపవచ్చని.. సలహాలు, సూచనలు కూడా ఇవ్వొచని ఆయన చెప్పారు. 9959226141 ఫోన్ నెంబర్ ద్వారా ప్రజలు మాట్లాడొచ్చని తెలిపారు.

## ఐదు తరగతులకు ఒకే టీచర్

**కొందుర్గు , డిసెంబరు 19 ప్రభాతవార్త** తమ గ్రామ ప్రాథమిక పాఠశాల లో ఐదు తరగతులు ఉండగా పాటలు చెప్పుటకు మాత్రం ఒకే టీచర్ ఉన్నారని గ్రామస్తులు తెలిపారు. ఒకే టీచర్ ఉన్నందున ఐదు తరగతులకు పాటలు చెప్పలేక పోతున్నారని, దాంతో విద్యార్థులు నష్టపోతున్నారని తల్లి దండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలస్థాయి అధికారులు స్పందించి వెంటనే డిప్యూషన్ పై మరొక టీచర్ ను, ఒక విద్య వాలింటర్ ను నియమించాలని విద్యార్థుల తల్లి దండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

## వకీల్ సాబ్ వీరేంద్రుడి సేవలు మరువలేనివి

**ఏపీ జితేందర్ రెడ్డి**



**కేశంపేట డిసెంబరు 19 ప్రభాతవార్త** తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, పేరు గాంచిన న్యాయవాది, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కీర్తిశేషులు తాండ్ర వీరేందర్ రెడ్డి పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచి నిలిచిపోతుందని సమాజానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని ఏపీజితేందర్ రెడ్డి అన్నారు. కీర్తిశేషులు వీరేందర్ రెడ్డి దశదిన కార్యక్రమం గురువారం కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డి గూడ గ్రామంలో ఆయన స్వగృహంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖులు మాజీ ఎమ్మెల్యేలు బీక్ష కిష్టయ్య, శంకర్రావు, ఇందిరా, ప్రతాప్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి , సోమిరెడ్డి నరేందర్ రెడ్డి, కేశంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూడ వీరేశం, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్, ఎండి అమీర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భాస్కర్ గౌడ్, కేశంపేట మాజీ ఎన్నం శ్రీధర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, రావుల పెంటయ్య ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు పర్వతాలు, కోరుదు రాములు, కేశంపేట్ మండల కాంగ్రెస్ నాయకులు, షాద్ నగర్ సీనియర్ జర్నలిస్టులు ఎండి ఖాజా పాషా, లట్టుపల్లి మోహన్ రెడ్డి, రాఘవేందర్ గౌడ్, కేశంపేట జర్నలిస్టులు, లక్ష్మణ్ ముదిరాజ్, రామకృష్ణ గౌడ్, రాజశేఖర్, దర్శన్ గౌడ్, రమేష్, రమణ గౌడ్, అల్లగొండ సీనయ్య ఆంజనేయులు , వివిధ పార్టీలకు చెందిన నాయకులు ప్రజా ప్రతినిధులు, న్యాయవాదులు హాజరై కీర్తిశేషులు వీరేందర్ రెడ్డి తనయుడు శ్రవణ్ రెడ్డి ఆయన సతీమణి కేశంపేట తాజా మాజీ జడ్పిటిసి విశాల కుటుంబ సభ్యులను పలువురు పరామర్శించారు.

## గోడ పత్రిక విడుదల

**జిల్లెడు చౌదరిగూడ, డిసెంబరు 19,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలో గురువారం సిపిఐ వంద సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవ గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సదర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య మాట్లాడుతూ సిపిఐ పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు పేద ప్రజల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేసినట్లు పెర్కొన్నారు. సిపిఐ మండల కార్యదర్శి వెంకటేష్, కృష్ణ, లింగం, చిన్నయ్య, వీరేషం, సంగీ, అంజయ్య, చంద్రమ్మ, జంగమ్మ పాల్గొన్నారు.

## సర్వేను పరిశీలించిన ఎంపిడిఓ

**జిల్లెడు చౌదరిగూడ, డిసెంబరు 19,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఆయా గ్రామాలలో జరుగుతున్న ఇందిమ్మ ఇళ్ల సర్వేను ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్ గురువారం పరిశీలించారు. మండలంలోని ఇంద్రానగర్, చౌదరిగూడ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్‌తో పాటు ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పంచాయితీ కార్యదర్శి పాండురంగంగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు. అంజనేయులు, చంద్రబాబుగౌడ్ పాల్గొన్నారు.

### అక్రమాలకు పాల్పడుతున్న అధికారిపై చర్యలు తీసుకోవాలి

**జిల్లెడు చౌదరిగూడ, డిసెంబరు 19,(ప్రభాతవార్త):** గ్రామంలోని ప్రజలను మోసం చేస్తు అక్రమాలకు పాల్పడుతున్న పంచాయితీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని జిల్లెడు గ్రామ ప్రజలు గురువారం ఎంపిడిఓకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో పని చేస్తున్న పంచాయితీ కార్యదర్శి సమత ఇళ్ల సర్వే చేస్తు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు పెర్కొన్నారు. ఆమెపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు, గ్రామస్తులు గిరిధర్‌గోపాల్, శశిధర్, ప్రభాకర్, మహెష్, వెంకటేష్, బాలమణి, సునిత, సత్యయ్య, ఎల్లేశ్వర్, బాలయ్య, భరత్‌కుమార్, యాదయ్య, జంగయ్య, మల్లయ్య, శేఖర్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## వాహనాలపై కఠిన చర్యలు ఉంటాయి : సిఐ

**పూడూరు, డిసెంబరు 19, ప్రభాతవార్త :** చట్టవ్యతిరేకంగా నడిపే వాహనాలపై కఠిన చర్యలు ఉంటాయని పరిగి సిఐ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.గురువారం పూడూరు మండలం పరిధిలోని చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్ మన్నెగూడ చౌరస్తాలో డ్రంక్‌అండ్‌డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టవ్యతిరేకంగా వాహనాలు నడిపేవారికి కఠిన చర్యలు ఉంటాయని వివరించారు.ఈ విషయంపై వాహనదారులకు అవగాహన కల్పించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ మధుసూధన్‌రెడ్డి,సిబ్బంది తదితరుల పాల్గొన్నారు.



## దశాబ్దాల నాటికీ మేలుకోన్న వైద్యాధికారులు

**నవాబుపేట డిసెంబరు 19,ప్రభాతవార్త :** గ్రామాల్లో తిష్ఠవేసిన పీఎంపీ, ఆర్ఎంపీలపై దశాబ్దాల అనంతరం వైద్యాధికారులు తనిఖీలు నిర్వహిచడం హర్షనీయం. ప్రజల ప్రాణాలతో చలగాటమాడుకుంటున్న నకిలీ వైద్యుల విషయంలో నేటికి ఉన్నత అధికారులు స్పందించడంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వైద్యాధికారి వై వెంకటవరణ ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రంతో పాటు పులుమామిడి గ్రామాల్లో మండల వైద్యాధికాకి రోహిత్ సిబ్బందితో పీఎంపీ, ఆర్ఎంపీ ప్రాథమిక చికుత్స కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేద్రంలో అనుమతులు నేకుండా నిర్వవహిస్తున్న రుక్మిణి ప్రాథమిక చికిత్స కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ కేంద్రం నిర్వహనకు ఏలాంటి అనుమతులు లేవని ఇక్కడ ఇష్టారాజంగా అన్ని రకాల వైద్య సేవలు చేస్తున్నట్లు తేలిందని వైద్యాధికారి రోహిత్ తెలిపారు. ఈ కేద్రం దాదాపు 20 సంవత్సరాల నుండి నిర్వహిస్తున్నట్లు స్థానికులు తెలిపారని ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో అనుమతిలేని ఈ కేంద్రాన్ని మూసివేయించినట్లు చెప్పారు. అదేవిధంగా మండల పరిధిలోని పులుమామిడిలో సహితం ఏలాంటి అనుమతులు లేకుండా ప్రథమ చికిత్స కేంద్రం నిర్వహిస్తున్న కేంద్రాన్ని కూడా మూపివేసినట్లు ఆయన తెలిపారు. ఈ తనిఖీలో సీహెచ్‌వో రఫీ, ఎంపీహెచ్‌వో నర్సింలు తదితరులు ఉన్నారు.

## మేడ్చల్‌కు చేరుకున్న గోరక్షణ పాదయాత్ర

**మేడ్చల్, డిసెంబరు 19. ప్రభాతవార్త :** గోరక్షణ, భూ రక్షణ, పర్యావరణ రక్షణ కొరకు కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అయ్యప్ప గురుస్వామి బాలకృష్ణ స్వామి చేపడుతున్న పాదయాత్ర గురువారం మేడ్చల్ పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలో స్థానికులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి బాలకృష్ణ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి రక్షణలో భాగంగా ఈ భూమి మీద గో సంతతిని రక్షించడం కూడా మన యొక్క ధర్మమని తెలిపారు. తాను కశ్మీర్ నుంచి చేస్తున్న పాదయాత్రలో గోవు యొక్క ప్రాధాన్యతను వివరిస్తూ భారతదేశంలో గోసంపదను పెంచి వాటి ద్వారా వ్యవసాయానికి, ప్రజలకు ఉపయోగపడే ప్రయోజనాలను వివరించే ప్రయత్నం చేస్తున్నానని చెప్పారు. ఈ ప్రయత్నం ఇంకా ఉధృతం చేసేందుకే నా ఈ పాదయాత్ర అని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వర గురు స్వామి, మాజీ సర్పంచ్ మురళీధర్ గుప్త, నాయకులు సుధాకర్‌రెడ్డి, రఘురాం పటేల్, శంకర్ ముదిరాజ్, రవీందర్, మండల రవికుమార్, అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.



**NOTICE**
**IN THE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE CUM II ADDL METROPOLITAN MAGISTRATE; R.R. DISTRICT AT L.B. NAGAR**
**O.S. No. 818 of 2024**
Between:
**G. Bhujatha & others ...Plaintiffs**
And
**The Tahsildar & another ...Defendants**
To
**All Concerned ...Defendant No.2**
It is to inform to All Concerned that the Plaintiffs herein filed the above suit against the Defendants for Declaration of Legal Heirs in respect of Plot bearing No.398 Nothern part in Sy.No.196 Admeasuring 100 sq.yards situated at Gurramguda Badangpet Municipality, Balapur Mandal, R.R.District and the said suit was posted on **9-1-2025** for defendants' appearance hence any persons are interested hereby informed to appear before the above Hon'ble Court on **9-1-2025 at 10-30 am** in person or through an advocate without fail.
(BY ORDER OF THE HON'BLE COURT)
**Sd/- G. Rajeshwar Rao**
**S. Madhusudhan Reddy**
**Advocates**
**Counsel for Plaintiffs**
Plot No.121, Road No.4, Phase-I Apple Avenue Colony, Injapur, R.R.District. Pin Code.501510
**Cell: 9848239587**

## అక్రమ అరెస్టులకు అదిరేది లేదు

**శంకర్‌పల్లి, డిసెంబరు 19, ప్రభాతవార్త:** అక్రమ అరెస్టులకు బెదరమని, పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని మాల అనుబంధ కులాల హక్కుల పరిరక్షణ ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ బందారి బాల కిషన్ అన్నారు.మాలల హక్కుల అణిచివేతలపై కుట్రలను నిరసిస్తూ చేపట్టిన ఛలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వీర్యం చేయడానికి రేవంత్ సర్కార్ ముందస్తుగా గృహనిర్బంధాలు చేసి, పోలీస్ స్టేషన్లకు తరలించ డాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాల, మాల అనుబంధ కులాల హక్కుల పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ బందారి బాలకిషన్ అన్నారు దళితుల మధ్యన చిచ్చుపెట్టి, ఎస్సి రిజర్వేషన్ల ను పూర్తిగా తొలగించే కుట్ర జరుగుతుందని,ఎస్సీ ,ఎస్టీ సబ్ ప్లాన్ మరియు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలు చేసి ఎస్సీల అభివృద్ధికి కృషి చేయాలని, ఎస్సీల జనాభా దామాషా ప్రకారం 25 శాతం ఇంకా రిజర్వేషన్లు పెంచాలని ఈడబ్ల్యూఎస్ కోటాను కేవలం ఉన్నత వర్గాల వారికే పరిమితం చేయకుండా ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీల వారికి కూడా ఈడబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. అంబేద్కర్ వాదులుగా, రాజ్యాంగ పరిరక్షకులుగా దళితులకు జరుగుతున్నటువంటి అన్యాయాలను పసిగట్టి పోరాటాలు చేస్తున్న క్రమంలో ప్రభుత్వాలు దళితులందరి హక్కులను నిర్వీర్యం చేయడానికి కుట్రలు జరుగుతున్నాయని అన్నారు.ప్రభుత్వ అరెస్టులకు మేము అదిరేది బెదిరేది అస్సలు లేదు, మా పోరాటాన్ని మరింత తీవ్రతరం చేసి మాలల హక్కులు, దళితుల హక్కులు మరియు రాజ్యాంగ పరిరక్షణ కోసం వెనకడుగు వేయమని ఏ పోరాటానికైన సిద్ధమని ఈ సందర్భంగా తెలియజేశారు. శంకర్ పల్లి పోలీసులు అరెస్టు చేసిన వారిలో మల్లె పూల శంకరయ్య, మాల వికాస్, మాల నర్సింలు, ఎల్లకొండ వెంకటేష్, బి రాములు తదితరులు పాల్గొన్నారు.

### పోలీసులు ముందస్తుగా అరెస్టు అప్రజాస్వామికం



మాల మహనాడు నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

**పెద్దేముల్, డిసెంబరు 19, ప్రభాతవార్త:** పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని మాలమహనాడు నాయకులు డీలర్ అంజయ్య ఆరోపించారు. రాష్ట్ర మాల మహనాడు నాయకుల పిలుపుమేరకు అసెంబ్లీ ముట్టడి కార్యాక్రమానికి వెలుతున్న మండల మాల మహనాడు నాయకులైన డీలర్ అంజయ్య, రమాకాంత్, శ్రీని వాస్, నర్సిములు, కల్కోడ అంజయ్య, నాగేష్, మల్లేశంలను పోలీసు లు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ఏబిసిడి వర్గీకరణను వెంటనే నిలిపివే యాలని డిమాండ్ చేశారు. ఏబిసిడి వర్గీకరణతో మాలలకుతీవ్ర అన్యా యం జరుగుతుందని అన్నారు. ఏబిసిడి వర్గీకరణను నిలిపేంతవరకు తమ పోరాటం ఆగదని స్పష్టంచేశారు.

### నవాబుపేటలో..



ముందస్తు అరెస్ట్ చేసిన మాల మహనాడు నాయకులు

**నవాబుపేట డిసెంబరు 19,ప్రభాతవార్త :** ఎస్సీ వర్గీకరణ చేయకూడదని గురువారం అసెంబ్లీ ముట్టడికి పిలుపు నిచ్చిన మాల మహనాడు నాయకుల పిలుపు మేరకు స్థానిక మాల మాహనాడు నాయకులను పోలీసులు గురువారం ముందస్తు అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన వారిలో సినీయర్ నాయకులు శివరాజు, ఆనందం, శాంతకుమార్, గాలయ్య, లక్ష్మన్, పురుషోత్తం, శ్యాంరావు, పాండు, పద్మారావు, రాచయ్య తదిత రులు ఉన్నారు.

### నేడు సీఎం కప్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

**కొడంగల్,డిసెంబరు 19ప్రభాతవార్త** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం సీఎం కప్ జిల్లా స్ధాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు పీడీఓలు అనిల్,అజీజ్‌లు తెలిపారు.జిల్లాలోని అన్ని మండలాల నుంచి విద్యార్థినీ,విద్యార్థులు కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు కొడంగల్‌కు విచ్చేయుచున్నారని వారు తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి టోర్నమెంట్ ప్రారంభం కానుందని వారు తెలిపారు.

### ప్రైవేట్ వాహన డ్రైవర్లకు అవగాహన సదస్సు

**శంకర్‌పల్లి, డిసెంబరు 19, ప్రభాతవార్త:** శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ లో గురువారం ప్రైవేటు బస్సు డ్రైవర్లు, ఓనర్లకు ఆర్టీవో, పోలీసు అధికారులు అవగాహన సదస్సు నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ గౌడ్, ఎంవిఐ సునీత మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలకు సంబంధించిన ప్రైవేటు, టాక్సీ ప్లేట్ వాహనాలు తెలంగాణ రాష్ట్రం లోకి వచ్చినప్పుడు స్థానిక డ్రైవర్లు, ఓనర్లు వాహ నాలను ఆపి ప్రయాణికులను ఇబ్బందులు కలిగించరాదని సూచించారు. అంతర్రాష్ట్ర సరిహద్దులు, చెక్ పోస్ట్ ల వద్ద ఆర్టీవో అధికారులు వాహనాలను పట్టుకుంటారని తెలియజేశారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### డ్రైవర్లకు సంక్షేమ పథకాలను అమలు చేయాలి



డ్రైవర్స్ యూనియన్ సమావేశంలో పాల్గొన్న నర్సింగ్‌రావు, సబిత తదితరులు

**ఘట్‌కేసర్, డిసెంబరు 19, ప్రభాతవార్త:** రవాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆల్‌ఇండియా ట్రాన్స్‌ఫోర్ట్ వెల్ఫేర్ ఫెడరేషన్ యూనియన్ జిల్లా ఇంచార్జ్ బంగారు నర్సింగ్‌రావు డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం జైగట్టుమైసమ్మతల్లి ట్రాలీ ట్రాన్స్‌ఫోర్ట్ డ్రైవర్స్ యూనియన్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి నర్సింగ్‌రావు మఖ్యఅతిధిగా హజరై మాట్లాడుతూ ఘట్‌కేసర్‌లో పనిచేస్తున్న ఆటో, డీసీఎం డ్రైవర్లకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. డ్రైవర్లపై ఆర్‌టిఏ అధికారుల వేధింపులు ఆపాలని, ప్రైవేట్ యాప్స్‌నియంత్రించాలని, కేరళ మాదిరిగా ప్రభుత్వ యాప్స్ తీసుకురావాలని, ఈచలాన్ భారాలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్రం తెచ్చిన కొత్త చట్టం మోటార్ వాహనాల చట్ట సంరణ బిల్లు 2019ను ఉపసంహరించుకోవాలన్నారు. సీఐటియు కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నరిసన ర్యాలీ జరిపారు. సీఐటీయు నాయకురాలు నార్కట్‌పల్లి సబిత కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై ఆందోళనలు, పోరాటాలకు సిద్ధం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ట్రాలీ ట్రాన్‌ఫోర్ట్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు, గట్టు మైసమ్మ ట్రాన్స్‌ఫోర్ట్ యూనియన్ అధ్యక్షులు చెరుకు శ్రీకాంత్‌గౌడ్, ఎన్.శరవంద, పి.క్రిష్ణారెడ్డి, ఎం.మల్లేశ్, చెరుకు శేఖర్, ఆనంద్, రాజశేఖర్, పాషా, దొంకెన సురేశ్‌గౌడ్, బాలరాజు, లింగస్వామి, గణేశ , బషీర్, బంటి, మల్లేశ్, హలీమియా, కుమారస్వామి, దేవరాజు, శ్రీనివాస్, జయంత్‌రెడ్డి, వెంకయ్య, సిరికాశిరావు, స్వామి, నర్సింగ్‌రావు, వెంకటేశం, సత్యనారాయణ, రామరంజులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు వ్యతిరేక చట్టాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి

### రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పస్య పద్మ



మాట్లాడుతున్న రాష్ట్ర రైతుసంఘం ప్రధాన కార్యదర్శి పస్య పద్మ,పాల్గొన్న జిల్లా సిపిఐ కార్యదర్శి డిజి సాయిలుగౌడ్

**శామీర్‌పేట, డిసెంబరు 19, ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వం వెంటనే రైతు వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని స్పందించకుంటే తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగుతాయని రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పస్య పద్మ స్పష్టం చేశారు. గురువారం శామీర్‌పేట మినీస్టేడియంలో తెలంగాణ రాష్ట్ర రైతుసం ఘం (ఎఐకెఎస్) మేడ్చల్ జిల్లా రైతు సంఘం మూడవ మహాసభలు జరిగా యి. ఈ సందర్భంగ పాల్గొన్న రాష్ట్ర రైతుసంఘం ప్రధాన కార్యదర్శి పస్య పద్మ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుబంధు, రైతు రుణమాఫీ పూర్తికాలేదని, రైతులు అనేక మంది ఉన్నారని, కౌలు రైతులకు కూడ రైతుబంధు, రైతు భీమా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సన్నవడ్లతో పాటు దొడ్డు వడ్లకు కూడ బోనస్ 500రూపాయలు చెల్లించాలని ఆమె రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అదే విధంగ బ్యాంకు రుణాలు కూడ ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపె డుతున్న భూభారతిలో పెండింగ్‌లో ఉన్న సాదా బైనామాలు, క్రమబ ద్ధీకరణలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్ర గీతపనివారల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా సిపిఐ కార్యదర్శి డిజి సాయిలుగౌడ్ మాట్లా డుతూ జిల్లాలో ఉన్న భూసమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఉన్న భూసమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సాయిలుగౌడ్ కోరారు. మేడ్చల్ జిల్లా రైతు సంఘం అధ్యక్షులుగా సామల వెంకట్‌రెడ్డి, అధ్య క్షులుగా డి.జంగయ్య, ఉపాధ్యక్షులుగా అంజనేయులు, డిజి సాయిలుగౌడ్, ఉప్పలయ్య, కార్య నిర్వాహక అధ్యక్షులుగా డిజి నరేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా నిమ్మల నర్సింహ్మా, సహాయ కార్యదర్శిగా మాచర్ల కనకయ్య, కోశాధికారిగ పి.చంద్ర య్య, కార్యవర్గసభ్యులుగా చీర్ల దర్శన్, బి.రాజిరెడ్డి, చీర్ల కౌసల్య, ఎన్.కమలమ్మ, ఫతేమహమ్మద్, అనిత, ఆర్.వెంకటేశ, ఎల్లయ్యలను ఏకగ్రీవంగ ఎన్నుకున్నారు. దీనికి ముందుగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేశ్, ఖమ్మం జిల్లా సిపిఐ కార్యదర్శి, రాష్ట్రకార్యవర్గసభ్యులు పోటు ప్రసాద్‌లు ఇటీవల మృతిచెందటంతో వారికి పలువురు నాయకులు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.



### బొడ్రాయి వార్షికోత్సవంతో ఘనంగా యజ్ఞహోమ పూజలు

**శామీర్‌పేట, డిసెంబరు 19, ప్రభాతవార్త** శామీర్‌పేటలో నాభిశిల (బొడ్రాయి) రెండవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు ఘనంగ జరిగాయి. గురువారం ఉదయం శామీర్‌పేటలోని నూతన నాభిశిల (బొడ్రాయి) స్థాపించి రెండవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని యజ్ఞహోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ శివాలయం ప్రధాన అర్చకులు గడియారం మురళీధర్‌శర్మ ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణులు మంత్రోశ్చరణల మధ్య శామీర్‌పేట కట్టమైసమ్మ ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. గణపతి పూజ చేసి ఆ తరువాత గణపతి హోమం, నాభిశిలకు అభిషేకం కార్యక్రమం జరిగింది. ఆ తరువాత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శామీర్‌పేట గ్రామ ప్రజలు రాగిపాత్రలతో నీటిని తీసుకవచ్చి నాభిశిలకు పోసి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ ప్రజాప్రతినిధులు, శ్రీకట్టమైసమ్మ ఆలయ కమిటీ వారు, గ్రామ పెద్దలు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

### దౌల్తాబాద్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

**దౌల్తాబాద్,డిసెంబరు 19 ప్రభాతవార్త:**

దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారంరోజు మండలంలో పనిచేస్తున్న తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం ఉద్యోగ ఉపాధ్యాయులు సమావేశమై తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం దౌల్తాబాద్ మండల నూతన కార్యవర్గన్ని ఎనుకున్నారు.ఈ సమావేశానికి తెలం గాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షులు తిమ్యానాయక్ హాజరై సంఘం ఆవశ్యకతను,సంఘం చేసే వివిధ సేవల గురించి వివరించారు. ఉద్యోగ,ఉపాధ్యాయుల సమస్యలను పైస్థాయి అధికారుల,మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి నిరంతరం టిజియుఎస్ సంఘం కృషి చేస్తుందని తెలిపారు.రాబోయే కాలంలో సంఘాన్ని బలోపేతం చేసే విధంగా అందరు కృషి చేయాలని తెలిపారు.దౌల్తాబాద్ మండల అధ్యక్షులుగా కాట్రావత్ రమేష్ నాయక్,ప్రధాన కార్యదర్శిగా సభావత్ రవినాయక్,గౌరవ అధ్యక్షులుగా కె. అంబ్యానాయక్,మహిళా అధ్యక్షురాలుగా కె.సుజాత,ట్రెజరర్‌గా పరుశురాం, అసోసియేట్ అధ్యక్షులుగా కె.సక్ర్యానాయక్,ఉపాధ్యాక్షులుగా వి.వినోద్‌కుమార్ లను ఎన్నుకోవడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా లంబాడ హక్కుల పోరాట సమితి నాయకులు దామోదర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### మున్సిపల్ అభివృద్ధికి నిధుల కేటాయింపు: చైర్మన్





**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 19, ప్రభాతవార్త:** పోచారం మున్సిపల్ అభివృద్ధికి ఐదు కోట్ల 45 లక్షల నిధులు వెచ్చించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపిందని చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి తెలిపారు. పోచారం మున్సిపల్ సర్వసభ్య సమావేశం మున్సిపల్ చైర్మన్ అధ్యక్షతన గురువారం జరిగింది. మున్సిపల్ సమావేశం ప్రారంభం కాగానే 8 వ వార్డు కౌన్సిల్ సభ్యురాలు బైర హీమ ఇటీవల ఆకాల మృత్యువాత పడటంతో సభలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో మున్సిపల్ అభివృద్ధిలో భాగంగా చేపట్టాల్సిన పనులపై చర్చ జరిగింది. పారిశుధ్య పను లు, సిబ్బందికి పనిముట్ల కొనుగోలు, స్వచ్ఛ సర్వేక్షన్, ఎనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రానికి మెయింటెన్స్, స్టేషనరీ కొనుగోలు, నూతనంగా మున్సిపల్‌లో విలీనమైన గ్రామాల సిబ్బంది జీతభత్యాలు మొత్తం కలిపి ఐదు కోట్ల 45 లక్షల పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపిందని చైర్మన్ పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని యంనంపేట్ శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాల, రాక్ ఇంటర్నేషనల్ స్కూల్ టాక్స్ అసెస్‌మెంటు రీ అస్మెస్‌మెంటు చేయాలని సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. చైర్మన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిషనర్ వీరారెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కౌన్సిలర్లు జి. మహేశ్ కురుమ, నర్రీ ధనలక్ష్మి, చింతల రాజశేఖర్, సింగిరెడ్డి సాయిరెడ్డి, మెట్టు బాల్‌రెడ్డి, బి. వెం కటేశ్ గౌడ్, బి. హరిప్రసాద్‌రావు, నల్లవెల్లి లక్ష్మీ, సామల శ్రీలతరెడ్డి, అబ్బవతి సరిత, మోటుపల్లి పోచమ్మ, బద్దం మమత, కో ఆప్షన్ సభ్యులు దాసరి శంకర్, మేనేజర్ అంజన్‌రెడ్డి, ఏఈ. మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

### సేవాలాల్ మహారాజ్ జయంతికి

**ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్**

**షాద్‌నగర్, డిసెంబరు 19 ప్రభాతవార్త :** ఈనెల 29న షాద్‌నగర్ పట్టణంలో లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో లంబాడీ భాష గోర్‌బోలీని రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్డులో చేర్చాలని, అదేవిధంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి 15వ తేదీన ప్రభుత్వం అధికారిక సెలవుదినంగా ప్రకటించాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్ డిమాండ్ చేశారు. గురువారం షాద్‌నగర్ పట్టణంలోని దేవిగ్రాండ్ హోటల్ మీటింగ్ హాల్‌లో ఎల్‌హెచ్‌పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గౌరవ అధ్యక్షుడు మిట్టు నాయక్, మంగులాల్ నాయక్, రమావత్ రాజు నాయక్, నియోజకవర్గ అధ్యక్షుడు, అన్ని మండలాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, యువజన విభాగం అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు. షాద్‌నగర్‌లో లంబాడీల గర్జన పేరు మీద భారీ సభ నిర్వహించాలనే నిర్ణయం మేరకు ఈనెల 29న లంబాడీల గర్జన సభను విజయవంతం చేయాలని, నియోజకవర్గంలోని అన్ని మండలాలు, తండాల నుండి పెద్దఎత్తున లంబాడీలు పార్టీలకు అతీతంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

### కళాశాల యాజమాన్యం విద్యార్థులను వేధించడం మానుకోవాలి : మాజీ ఎంపీపీ

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 19, ప్రభాతవార్త:** గత, ప్రస్తుత ప్రభుత్వాలు విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంటు నిధులు విడుదల చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాజీ ఎంపీపీ వై. సుదర్శన్ రెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్ యంనంపేట్ శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు ఫీజులు చెల్లించకపోవడంతో కళాశాల యాజమాన్యం ఇబ్బందులగు గురిచేస్తుండటంతో ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. విద్యార్థుల ఆందోళనకు మద్దతుగా బీజేపీ నేత, మాజీ ఎంపీపీ పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నేత మాటాడుతూ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా శ్రీనిధి కళాశాల యాజమాన్యం విద్యార్థులను స్వంతంగా ఫీజులు చెల్లించాలని, లేనిచో సర్టిఫికేట్లు ఇవ్వమని విద్యార్థులను వేధింపులకు గురిచేస్తుందని అన్నారు. ఏబీవీపీ విద్యార్థి సంఘం ప్రతినిధులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

### నా ప్రాణం ఉన్నంత వరకు టీడీపీలోనే ఉంటా

**నాయకులు గిరిమోని హనుమంతు**

**షాద్‌నగర్, డిసెంబరు 19 ప్రభాతవార్త :**



గిరిమోని హనుమంతుకు సభ్యత్వాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బక్కని

నా ప్రాణం ఉన్నంత వరకు తెలుగుదేశం పార్టీలోనే కార్యకర్తగా ఉంటానంటూ షాద్‌నగర్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గిరిమోని హనుమంతు తెలిపారు. గురువారం తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు స్థానిక సీనియర్ నేత గిరిమోని హను మంతుతో పార్టీ డిజిటల్ సభ్యత్వాన్ని చేయించారు. ఈ సందర్భంగా గిరిమోని హనుమంతు మాట్లాడుతూ తన ప్రాణం ఉన్నంత వరకు తెలుగుదేశం పార్టీలోనే కార్యకర్తగా ఉంటానని స్పష్టం చేశారు. దీంతో మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహు లు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కరుడుగట్టిన కార్యకర్తలు నేటికీ ఉన్నారని చెప్పడానికి హనుమంతు ఒక నిదర్శ నమని అన్నారు. రాముడికి అండగా హనుమంతుడు ఉన్నట్లు తెలుగుదేశం పార్టీకి అండగా హనుమంతు లాంటి కార్యకర్తలు శ్రీరామ రక్షగా ఉంటారని బక్కని నర్సింహులు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

### దుద్యాల్‌లో పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు కసరత్తు

**దుద్యాల,డిసెంబరు 19, ప్రభాతవార్త:**



దుద్యాల్ మండలంలోని గ్రామాలు శాంతి భద్రతల పరంగా ఉమ్మడి బొంరాస్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోనే కాకుండా కోస్గి, దౌల్తాబాద్, కొడంగల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో కొనసాగుతున్నాయి. మండలం ప్రస్తుతం ఉమ్మడి బొంరాస్‌పేట్ మండల పరిషత్ లో కొనసాగుతుంది. దుద్యాల మండలానికి ప్రభుత్వం ఇటీవలే ప్రత్యేక మండల పరిషత్‌గా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో గురువారం కాద ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, ఎమ్మార్వో కిషన్ నాయక్ తో కలిసి పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు తాత్కాలిక భవనము ను పరిశీలించారు. గ్రామంలోని పల్లె దవఖానను తాత్కాలిక భవనముగా పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ఎంపిక చేయడం జరిగింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి అదనపు తరగతి గదుల నిర్మాణం, సగం పూర్తి అయిన బిల్డింగ్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ ఏఈ సురేందర్ రెడ్డిని ఆదేశించారు. త్వరలోనే పల్లె దవఖాన భవనం యందు పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అబ్దుల్ రవూఫ్, ఎంఈఓ విజయరామరావు, డిప్యూటీ ఎమ్మార్వో వీరేష్ బాబు, ఖాజ, శ్రీశైలం గౌడ్, కృష్ణయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### పోలీసు స్టేషన్ సందర్శించిన డిఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

**కోట్‌పల్లి,డిసెంబరు 19,ప్రభాతవార్త;** కోట్‌పల్లి మండల కేంద్రంలో గురువారం నాడు పోలీసు స్టేషన్‌ను వికారాబాద్ డిఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ. ఏయే సమస్యలపై అధికంగా పిర్యాదులు వచ్చాయనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. రోజు రోజుకు వాహనాల వినియోగం తీవ్ర మవుతుందని ప్రమాదాలు కుడా జరగకుండా పోలీసులతో కలిసి ఎప్పటికప్పుడు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. గ్రామాలల్లో సైబర్‌క్రైంపై ప్రజలల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. నమోదు అవుతున్న కేసుల వివరాలు సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ధారూర్ సీఐ రఘురాములు, ఎస్సై స్రవంతి, పోలీసు సిబ్బంది ఉన్నారు,

## ఘట్‌కేసర్‌లో ఘనంగా క్రిస్‌మస్ వేడుకలు



**ఘట్‌కేసర్, డిసెంబరు 19, ప్రభాతవార్త:** పార్టీలకతీతంగా మైనారిటీ సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షులు-మేడ్చల్ ఇంచార్జ్ తోటకూర వజ్రేశ్‌యాదవ్ అన్నారు. ఘట్‌కేసర్‌లోని నారాయణగార్డెన్స్‌లో జరిగిన మేడ్చల్ నియోజకవర్గ క్రిస్‌మస్ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. మేడ్చల్, శామీర్‌పేట్, మూడుచింతలపల్లి, కీసర, ఘట్‌కేసర్ మండలాలకు చెందిన క్రైస్తవ మతపెద్దలు, బిషప్‌లు, చర్చీల ఫాస్టర్లు క్రిస్‌మస్ వేడుకల్లో పాల్గొన్నా రు. ఈసందర్భంగా సిద్దిపేట్‌కు చెందిన మతపెద్దలు ముఖ్యప్రసంగీకులుగా విచ్చేసిన బ్రదర్ ప్రకాశ్‌రావు మాట్లాడుతూ ఏసుక్రీస్తు జననం, జీవనం, మరణంకు సంబంధించిన పలు విషయాలను తెలియజేశారు. క్రిస్‌మస్ గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఘట్‌కేసర్ మండల ఫాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీసీడబ్ల్యుఏజిఎం) సేవకుల, సంఘాల సహకారి ద్వారా మెగా క్రిస్‌మస్ సంబరాలు ఘనంగా నిర్వహిం చారు. వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం క్రిస్‌మస్ సందర్భంగా నియోజకవర్గంలోని క్రైస్తవులు ఒకే చోట వేడుకలు జరుపుకోవడం హర్షణీయమన్నారు. సీఎం రేంత్‌రెడ్డి మైనారిటీ అభ్యున్నతికి అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వజ్రేశ్‌యాదవ్‌తో పాటు ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్‌లు కేక్‌కట్ చేసి క్రైస్తవ సోదరులకు తినిపించారు. ఈకార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి వీణా, ఘట్‌కేసర్, శామీర్‌పేట్ తహశీల్దార్లు డిఎస్.రజని, యాదగిరిరెడ్డి, కౌన్సిలర్లు కొమ్మిడి అనురాధ, సల్లూరి నాగజ్యోతి నర్సింగ్‌రావు, కడుపోల్ల మల్లేశ్, ఆప్షన్ సభ్యురాలు బొట్టు అరుణ కృపానిధి, సహకార సంఘం డైరెక్టర్ రేసు లక్ష్మారెడ్డి, పీసీడబ్ల్యుఏజిఎం అధ్యక్షులు రేవా కాపుకుమార్, కార్యదర్శి దొడ్డి గార్ల ప్రభాకర్, కోశాధికారి గుడి హెబినేజర్, సురేందర్‌పాల్, సుక్క జాషు వా, ఏసు రమేశ్, రిప్ కాశ్యామ్ నాతారీ దేవిడ్సన్, జోసెఫ్, ఈవెంట్స్‌పాల్, టీజేఎస్ రాష్ట్ర నాయకులు మారం లక్ష్మారెడ్డి, సహకార సంఘం మాజీ డైరెక్టర్ బొక్క ప్రభాకర్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి ఉల్లి అంజనేయులు, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలుయాదవ్, ప్రధా నకార్యదర్శి బర్ల రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు కొరుబోతు నాగరాజు, యూత్‌కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి, ఎస్‌సీ సెల్ అధ్యక్షులు మోత్కుపల్లి శ్రీనివాస్, జిల్లా మైనారిటీసెల్ ఉపాధ్యక్షులు అశ్రాఫ్, మాజీ వార్డుసభ్యులు నానావత్ సురేశ్‌నాయక్ పాల్గొన్నారు.



సిసి కెమెరాల ఏర్పాటుకు చేవేళ్ల సిఐ శ్రీధర్‌భూపాల్‌కు 4 లక్షల రూపాయల చెక్కును అందజేస్తున్న చేవేళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం

### శాంతిభద్రతల పరిరక్షణకు సిఐ కృషి అభినందనీయం

**చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం పిలుపు**

**చేవెళ్ళ, డిసెంబరు 19, ప్రభాతవార్త**

యువత సామాజిక సేవలను అలవర్చుకోవాలని చేవెళ్ల మాజీ ఏమ్మెల్యే కెఎస్ రత్నం పిలుపునిచ్చారు.గురువారం చేవెళ్ల మండల కేంద్రంలో సిసి కెమెరాల ఏర్పాటుకు బిజెపి సీనియర్ నాయకుడు మల్గారి వైభవ్‌రెడ్డి నాలుగు లక్షల రూపాయల చెక్కును చేవెళ్ల సిఐ భూపాల్ శ్రీధర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం మాట్లాడుతూ పోలీసులకు ప్రజలు సహకరించినప్పుడే శాంతి భద్రతల రక్షణ సాధ్యమౌతుందన్నారు. పోలీసులు నిరంతరం ప్రజల రక్షణ కోసమే పనిచేస్తున్నారన్నారు. చేవెళ్ల సిఐ శ్రీధర్ భూపాల్ ప్రత్యేక శ్రద్ధతో చేవెళ్ల మండలంలో నిఘా నేత్రాలను ఏర్పాటు చేపించడం గర్వకారణమన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు 24 గంటలు పని చేస్తున్న పోలీసులకు యువత సహకరించాలన్నారు. ప్రజల అవసరాలకు ఉపయోగ పడే పని కోసం ప్రతి ఒక్కరు ముందుకురా వాలన్నారు. చేవెళ్ల మండలంలోని ప్రతి రహదరిపైన,కాలనీలల్లో గ్రామంలోని ప్రతి చౌరస్తాలో సిసి కెమెరాలను ఏర్పాటుకు పోలీసులు నడుంబిగించా రన్నారు. రాజకీయాలకు అతీతంగా పోలీసులకు సహకరించాలన్నారు.చేవెళ్ల పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రతి ఒక్కరి సమస్యలను అడిగి తెలుసుకుని, వారి సమస్యలను పరిష్కరించి ప్రజల ప్రేమాభిమానాలను సిఐ భూపాల్ శ్రీధర్ పొందుతున్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు సిఐ భూపాల్ శ్రీధర్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ప్రభా కర్‌రెడ్డి, మల్గారి మచ్చేందర్‌రెడ్డి, అత్తెల్లి అనంతరెడ్డి,అల్లాడ శ్రీనివాస్‌రెడ్డి, మల్గారి దినేష్‌రెడ్డి,శంకర్‌గౌడ్,క్రిష్ణాగౌడ్ తదితరులు పాల్గొన్నారు

### మరోసారి అవకాశమిస్తే టౌన్‌షిప్ అభివృద్ధికి కృషి

**అధ్యక్షుడు హరిప్రసాద్‌రావు**



ఎన్నికల బరిలో నిలిచిన సభ్యులతో కౌన్సిలర్లు హరిప్రసాద్‌రావు, మెట్టు బాల్‌రెడ్డి తదితరులు

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 19, ప్రభాత వార్త:** సంస్కృతి టౌన్‌షిప్ అభివృద్దే ధ్యేయంగా అసోసియేషన్ ఎన్నికల్లో కొత్త ప్యానల్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కౌన్సిలర్, అధ్యక్షుడు అయిన బి. హరిప్రసాద్‌రావు తెలిపారు. ఈ నెల 22 వ తేదిన సంస్కృతి టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్స్ వేల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఓటింగ్ పద్దతి ద్వారా జరుగునున్నాయి. గురువారం అసోసియేషన్ ఎన్నికల బరిలో అధ్యక్షుడిగా బరిలో నిలిచిన హరిప్రసాద్‌రావు గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల మద్దతులో ఏర్పాటు చేసిన ప్యానెల్ సభ్యులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా కాలనీ అభివృద్ధి కొరకు చేసిన కృషిని వివరించారు. రెండు మార్లు అసోసియేషన్ కోశాధికారిగా రెండు మార్లు అధ్యక్షుడిగా, కౌన్సిలర్‌గా టౌన్‌షిప్ అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. టౌన్‌షిప్‌లో రోడ్లు, వీధి లైట్లు, పచ్చదనం, పరిశుభ్రత, సీసీ కెమెరాల ఏర్పాటు, మురుగునీటి శుద్ధీ ప్లాంటు ఏర్పాటు, లోటు బడ్జెట్‌తో ఉన్న అసోసియేషన్ తన హయంలో రెండున్నర కోట్ల నిధులు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు తెలిపారు. కోటికి పైగా కరెంటు బిల్లును విద్యుత్ లైన్ల మరమ్మత్తు, విద్యుత్ పొదుపు చర్యల కారణంగా 60 లక్షలకు తగ్గించినట్లు తెలిపారు. గతంలో తాగునీటి సరఫరా 11 లక్షల నీటి సరఫరా ఉండగా 20 లక్షల లీటర్ల తాగునీరు నిత్యం వాటర్ వర్క్స్ నుండి సరఫరా అయ్యేటట్లు కృషి చేసినట్లు తెలిపారు టౌన్‌షిప్‌లో ఒకే చోట మసీదు, చర్చి, దేవాలయం నిర్మించినట్లు తెలిపారు. కాలనీవాసులకు అందుబాటులో ఉండే విధంగా 108 అంబులెన్స్‌ను ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. కోవిడ్ సమయంలో కాలనీవాసులకు బహుముఖంగా సేవలు అందించినట్లు తెలిపారు. కాలనీలో సంస్కాతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. షాపింగ్ కాంప్లెక్సు ఏర్పాటు కొరకు 9 కోట్ల 30 లక్షల యూటీలీటి ఫండ్ ఏర్పాటు, మున్సిపల్ నుండి 30 లక్షల నిధులు కేటాయింపుకు కృషి చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో కాలనీని గ్రేటేడెడ్ కమ్యూనిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అసోసియేషన్ ప్యానెల్ ఏర్పాటు చేసి ఎన్నికల బరిలో ఉన్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా బి హరిప్రసాద్‌రావు, ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ రెడ్డి, కోశాధికారిగా కె. శ్రీ రామచంద్ర మూర్తి, కార్యవర్గ సభ్యులుగా పి. వెంకట్ రెడ్డి, పివి. సరిత, జిఎస్. ప్రతిభ, ఎ. జోగేశ్వరావు, కె. ప్రగతి, ఎన్. శ్రీనివాస్, వి. కొండయ్య, మందాడి మంజుల ఎన్నికలో బరిలో ఉన్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్ మెట్టు బాల్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు దాసరి శంకర్, మెట్టు నర్సింహ రెడ్డి, కెఎస్ఆర్. మూర్తి, రజనీకాంత్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని రక్షించాలి

**నేరెళ్ల చెరువు గ్రామ యువకుల మొర**

**ప్రభుత్వ భూమిని కాపాడాలని తహసీల్దార్‌కు వినతిపత్రం**

**ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు కల్పించుకోవాలని వినతి**



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేరెళ్లచెరువు గ్రామ యువకులు

**షాద్‌నగర్, డిసెంబరు 19 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా, ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల రెవెన్యూ పరిధిలో గల సర్వే నెంబరు 228, 229లో 4.26 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమిస్తున్నారని నేరెళ్ల చెరువు గ్రామ యువకులు ఫరూఖ్‌నగర్ మండల తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బూర్గుల రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 228లో 3.09 ఎకరాలు, సర్వే నెంబరు 229లో 1.17 ఎకరాల భూమి షబీర్ అనే రైతుకు చెందినదని, ఆ భూమిని ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి స్వాధీనపర్చుకొని నీటి నిల్వ కుంటలను నిర్మించిందని వినతిపత్రంలో పేర్కొన్నారు. అప్పటి 1997 సంవత్సరం సేత్వార్‌లో నమోదు అయ్యిందని, అంతేకాదు దానికి సంబంధించిన ఫైల్ నెం.ఎల్ఏబి3/488/97 లో వివరాలు ఉన్నాయని పేర్కొన్నారు. కానీ ప్రభుత్వ రికార్డులలో అట్టి భూమి షబ్బీర్ అలీ పేరుతోనే ఉండడంతో ఆ భూమిని బండ్ల శివబాబు అనే వ్యాపారస్తుడు కొనుగోలు చేసినట్లు డాక్యుమెంట్లు చేసి ఆ భూమిలో ఉన్న నీటి కుంటలను తొలగించి, యంత్రాలతో చదును చేసి, బోర్లు వేసుకొని ప్రహరీగోడ కట్టుకోవడం కోసం ప్రయత్నం చేస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. డిసెంబర్ 14న ఆ భూమిలో బోరు వేస్తుండడం గమనించిన గ్రామస్థులు దానిని అడ్డుకున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వ భూమిని కాపాడాలని తహసీల్దార్‌ను యువకులు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామ యువకులు భూపాల్, జావిద్, రాజు, ప్రదీప్, శివ, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.